ప్రజాశక్తి

విశాఖపట్నం

శుక్రవారం

జనవరి 05

2018

12 పేజీలు



నిరాహార దీక్షలు చేస్తున్న సిపిఎం నాయకులు, మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లోకనాథం(ఫైల్)

మహిళలకు రక్షణ కరువు...!

- జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై దాడి
- గిరిజన మూగ బాలికపై అత్యాచారం
- లైంగిక వేధింపుల కేసులో సిఐ సస్పెన్షన్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నగరంలో మహిళలకు రక్షణ కరువైందని ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు రుజువు చేస్తున్నాయి. మొన్న జెర్రిపోతులపాలెంలో ఓ మహిళను వివస్త్రను

మిగతా 4లో..



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గిరిజన మూగ బాలికకు న్యాయం జరిగే వరకూ పోరాటం

12లో

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

అత్యాచార బాధితురాలిని పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరు

★ సామాజిక సేవలోనూ సిపిఎం ప్రత్యేకం

★ రేపటి నుంచి అచ్యుతాపురంలో జిల్లా మహాసభలు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అలుపెరగని పోరాటం సాగిస్తోంది. ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలబడుతుంది. స్థానిక సమస్యల నుంచి ప్రభుత్వ వినాశకర విధానాలకు వరకు ప్రజా వ్యతిరేక విధాలన్నింటిపైనా పోరాడుతుంది. కార్మిక, కర్షక, గిరిజన, దళిత, వృత్తిదారులు ఇలా అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేసుకుంది. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ అచ్యుతాపురంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభల నేపథ్యంలో ప్రత్యేక కథనం...



ఎస్.రమేష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సెంటర్ స్ప్రెడ్‌లో..

జన్మభూమి పూర్తయ్యేనాటికి వినతులన్నీ పరిష్కరించాలి

-వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

-విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఐదో విడత జన్మభూమి పూర్తయ్యేనాటికి గతంలోనూ, ప్రస్తుతం ప్రజల నుంచి అందిన వినతులన్నింటినీ పరిష్కరించాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం విశాఖలోని పోర్టు గెస్ట్‌హౌస్ నుంచి ముఖ్యమంత్రి అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జన్మభూమి-మాఊరు కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఏ రోజు అందిన పిటిషన్లు ఆ రోజే ఆన్‌లైన్‌లో ఆప్‌డేట్ చేసి

మిగతా 4లో..



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహా'రణం'

-ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి బిజెపి కుట్ర

-డిసిఐ వేటుకు వ్యతిరేకంగా నేడు ప్రజాబ్యాలెట్

-స్టీల్‌ప్లాంట్ రక్షణకూ తప్పని పోరాటం

12లో



పాఠశాలల్లో వసతులకు రూ.5,200 కోట్లు

★ విశాఖ జిల్లాకు రూ.300 కోట్లు

★ నియోజకవర్గానికి రూ.20 కోట్లు

★ త్వరలో 14 వేల టీచర్ పోస్టుల భర్తీ

★ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చోడవరం

పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడానికి రూ.5,200 కోట్లు ఖర్చు చేయనున్నామని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు మాతృవియోగం నేపథ్యంలో ఆయనను పరామర్శించడానికి గురువారం చోడవరం వచ్చిన మంత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మౌలిక వసతుల కోసం అధికంగా ఖర్చు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాకు రూ.300 కోట్లు, ఒక్కో నియోజకవర్గానికి రూ.20 కోట్లు చొప్పున నిధులు అందుతాయని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంటా శ్రీనవాసరావు

రాష్ట్రంలో 14 వేల ఉపాధ్యాయ పోస్టులు, యూనివర్సిటీల్లో ఆచార్య పోస్టులు భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. వీటిలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండేందుకు

మిగతా 4లో..

'జన్మభూమి'లో నిరసనలు, నిలదీతలు

ఏజెన్సీలో ఐదోవిడత జన్మభూమి గ్రామసభల్లో భాగంగా మూడోరోజున కూడా నిలదీతల పర్వం కొనసాగింది. గత జన్మభూమి సమస్యల పరిష్కారానికే పత్తా లేని పరిస్థితుల్లో కొత్తగా అర్జీలు తీసుకుని ఏం చేస్తారంటూ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటించినా నేతలుగానీ, అధికారులు గానీ ఆ ఊసెత్తడం లేదని మండిపడుతున్నారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ, గ్రామసభల్లో తీర్మానించి అధికారులకు నివేదిస్తున్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం జిల్లా మహాసభల పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-హుకుంపేట

ఈనెల 7వ తేదీ నుంచి అచ్యుతాపురంలో జరిగే సిపిఎం 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పుణ్యారావు కోరారు. ఈమేరకు గురువారం వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు సిపిఎం నాయకులు కె.హేమలత, సిహెచ్.నర్సింగరావు, మిడియం బాబూరావు, ఎం.కృష్ణమూర్తి తదితరులు హాజరుకానున్నారని,పార్టీ నాయకులు, గిరిజనులు సభలకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు, కొండబాబు, రామారావు, రమణమూర్తి, లక్ష్మణ్, పండన్న, చిన్నారావు పాల్గొన్నారు.



పద్మాపురం వద్ద బారులు తీరిన పర్యాటకులు

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అరకు రూరల్

అరకులోయ పర్యాటక కేంద్రానికి గురువారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియాన్ని తిలకించారు. పర్యాటకుల తాకిడితో చిరు వ్యాపారులు ఆర్థికంగా లబ్ధి పొందారు. సాధారణంగా శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. గురువారం అధికసంఖ్యలో పర్యాటకులు తరలిరావడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ఎపిటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హుకుంపేట

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని తహశీల్దార్ శ్యాంబాబు, ఎంఇఒ రామచంద్రమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎపిటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచి, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు చిన్నారావు, వెంకటరమణదొర, మత్స్యరాజు, ప్రభాకరరావు, సత్యారావు, నాయుడు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహశీల్దార్, ఎంఇఒ



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సిపిఎం నేతలు

రసాభాసగా జన్మభూమి

అరకు రూరల్ : మండలంలోని పద్మాపురం, సుంకరమెట్ట పంచాయతీ కేంద్రాల్లో గురువారం జరిగిన జన్మభూమి కార్యక్రమం రసాభాసగా సాగింది. పద్మాపురంలో జరిగిన గ్రామసభకు విచ్చేసిన పాడేరు సబ్ కలెక్టర్ డికె.బాలాజీని సమస్యలపై గిరిజనులు నిలదీశారు. గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలను ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేదంటూ కార్యక్రమం మొదలు నుంచీ అధికారిని నిలదీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీనిచ్చారు. అనంతరం బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు భగత్‌రాం, మహేష్, రామన్న తదితరులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సుంకరమెట్ట గ్రామసభ సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు సురేంద్ర, నాయకులు రామారావు, చినబాబులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లిఖార్జునరావు, తహశీల్దార్ అరుణ, నేతలు, గిరిజనులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీత

డుంబ్రిగుడ : మండలంలోని కురిడిలో చంద్రన్నబీమా ఎందుకు ఇవ్వడం లేదంటూ అధికారులను డ్వాక్రా మహిళలు నిలదీశారు. కురిడిలో అసంపూర్తిగా గ్రావిటీ పథకాన్ని నిర్మించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కురిడి గ్రామసభలో పాల్గొన్న సిసిఎస్, జన్మభూమి ప్రత్యేక అధికారి రాహుల్‌పాండే మాట్లాడుతూ సమస్యలపై అందరూ దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిష్కరిస్తామన్నారు. రంగిలిసింగి పంచాయతీలో మరుగుదొడ్లు నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. వీటి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ సర్పంచ్ పి.అచ్చమ్మ, గిరిజన సంఘం మండల నాయకులు పి.డొంబు ఆధ్వర్యాన ఆ పంచాయతీ గిరిజనులు అధికారులను నిలదీశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదంటూ కురిడి, రంగిలిసింగి పంచాయతీ గిరిజనులు తీర్మానం చేసి ప్రత్యేక అధికారికి అందించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిడి లచ్చన్న, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మీనాకుమారి, తహశీల్దార్ బాబూసుందరం, హౌసింగ్ ఎఇ కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, రంగిలిసింగి, కురిడి సర్పంచ్‌లు అచ్చమ్మ, గెన్ను, కురిడి ఎంపిటిసి మహదేవ్, టిడిపి మండల అధ్యక్షులు సుబ్బారావు, మండల నాయకులు కె.ఆనంద్, నాగేశ్వరరావు, ఎం.స్వామి, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు



కిలగాడలో అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపిపి

గిరిజన సంఘం నేతలతో వాగ్వాదం

ముంచంగిపుట్టు : కిలగాడ జన్మభూమి సభలో గిరిజన సంఘం మండల కార్యదర్శి, వైస్ ఎంపిపి త్రినాథ్, గిరిజనులు అధికారులను చుట్టుముట్టి సమస్యలపై నిలదీశారు. ఈ సందర్భంగా కొంతమంది టిడిపి నాయకులు, గిరిజన సంఘం నేతలతో వాగ్వివాదానికి దిగారు. మరుగుదొడ్ల బిల్లులు చెల్లింపులో జాప్యం, నిర్మాణంలో అక్రమాలపై గిరిజనసంఘం నేతలు నిలదీయగా, పదిరోజుల్లో బిల్లులు చెల్లిస్తామని అధికారులు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. హౌసింగ్ బిల్లులు, తాగునీరు, పింఛన్లు, రేషన్‌కార్డులు వంటి సమస్యలపై గిరిజనులు ప్రశ్నల వర్షం కురిపించారు. సమాధానాలు చెప్పలేని పరిస్థితిలో అయిందనిపించి, జన్మభూమి గ్రామసభను అధికారులు ముగించారు. పనసపుట్టు పంచాయతీ జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వైసిపి నాయకులు రాంచందర్, ఎపిజిఎస్ జిల్లా నాయకులు పి.శాస్త్రిబాబు తదితరులు సమస్యలపై అధికారులను నిలదీశారు. గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని వినియోగంలోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



సమావేశం ఆలస్యం కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

తూతూమంత్రంగా జన్మభూమి

పెదబయలు రూరల్ : మండలంలోని రూడకోట పంచాయతీలో గురువారం జరిగిన జన్మభూమి కార్యక్రమం తూతూమంత్రంగా జరిగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం 12 గంటల వరకు జరగలేదు. అంతవరకు సభ ప్రాంగణం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. అనంతరం రూడకోట రహదారి సమస్యలపై సిపిఎం, ఎపిజిఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. అలాగే బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి జన్మభూమి ప్రత్యేక అధికారికి అందించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ జన్ని త్రినాధరావు, తహశీల్దార్ సుధాకర్, ఎంఇఒ కె.సింహాచలం, సర్పంచ్ కాంతమ్మ, ఎంపిటిసి జాంబవతి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమికి పిల్లలెందుకు

అరకు రూరల్ : బడికి పోయి చక్కగా చదువుకోవాల్సిన చిన్నారులు జన్మభూమి గ్రామసభల్లో దర్శనమిస్తున్నారు. గురువారం పద్మాపురంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో 20 మంది చిన్నారులు కూర్చున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వారు అక్కడే దర్శనమివ్వడం ప్రజాశక్తి కంట పడింది. కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ లేని పరిస్థితుల్లో గ్రామసభలను నింపడానికి విద్యార్థులను రప్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏం మొహం పెట్టుకుని వచ్చారు..?

ప్రశ్నించిన ఎపిజిఎస్, సిపిఎం నాయకులు

పాడేరు : మండలంలోని మోదాపల్లి పంచాయతీలో జన్మభూమి అధికారులను ఎపిజిఎస్, సిపిఎం నాయకులు పాలికి లక్కు, సుందరరావు, సూరిబాబు, అప్పారావు, రాజు తదితరులు సమస్యలపై నిలదీశారు. పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని, పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలను పట్టించుకోని అధికారులు, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని వచ్చారంటూ నిలదీశారు. సమస్యలను పరిష్కరించని జన్మభూమి తమకు వద్దంటూ తేల్చిచెప్పారు. ఎంపిడిఒ మధుమోహన్‌కుమార్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గిరిజనులు, ఎపిజిఎస్, సిపిఎం నాయకులు వినిపించుకోకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేంలేక కార్యక్రమాన్ని మమ అనిపించి వెనుదిరిగారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి

జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవాని



థింసా నృత్యమాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అనంతగిరి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. గురువారం కొండిబ పంచాయతీ జన్మభూమి గ్రామసభలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాల్లో గిరిజనులు తమ సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విశాఖకు చెందిన విద్యార్థినులు కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు గంగరాజు, కిల్లో మొశ్య, వైసిపి నాయకులు సుబ్బారావు, ఎపిజిఎస్ నాయకులు సన్యాసిరావు తదితరులు సర్పంచ్ రత్నకుమారి ఆధ్వర్యాన తీర్మానం చేసి అరకు ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవానిలకు తీర్మానపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపిపి పైడితల్లి, సర్పంచ్ రత్నకుమారి, టిడిపి నాయకులు బి.లక్ష్మి, తహశీల్దార్ జయప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చిరంజీవి, పిఆర్ జెఇ మాణిక్యం, టిడబ్ల్యు జెఇ అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు ఆనంద్, బుజ్జిబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తీర్మాన పత్రాన్ని అందిస్తున్న సిపిఎం నాయకులు

స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు

ప్రజాశక్తి-కొత్తకోట

కొత్తకోట పంచాయతీలో స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టనున్నట్లు సర్పంచి కోట నీలవేణి, కార్యదర్శి కె.కృష్ణమోహన్ స్పష్టం చేశారు. గురువారం పలు వార్తా పత్రికల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన కథనాలకు వారు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామంలో సామాజిక అవసరాలకు ఉపయోగించు కునేందుకు స్థల సమస్య తీవ్రంగా ఉందన్నారు. గ్రామంలో పది అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కేవలం నాలుగు భవనాలే ఉన్నాయని చెప్పారు. మిగిలిన వాటికి స్థలం లేక నిర్మాణాలు చేపట్ట లేకపోయామని తెలిపారు. గ్రామంలో అనేక మంది నివాస స్థలాలు లేక నానా ఇబ్బం దులు పడుతున్నారని చెప్పారు. శారదా మహిళ మండలి భవనాన్ని స్వాధీనం చేసుకొని అంగన్‌వాడీ కేంద్రం నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళ్యాణ మండపం నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూములు గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు.

మరుగుదొడ్లపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - దేవరాపల్లి

స్వచ్ఛభారత్‌లో భాగంగా స్థానిక జెడ్‌పి హైస్కూల్, ఎంపిపి స్కూల్(మెయిన్) విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని నినాదాలు చేశారు. హెచ్‌ఎం లక్ష్మీదేవి మాట్లాడుతూ, ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు అవుగడ్డ కృష్ణమూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

వడ్డాది :

బహిరంగ మలవిసర్జన నిర్మూలనతో అంటురోగాలకు దూరంగా ఉండవచ్చునని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ పెంటకోట ప్రభాకర్ సూచించారు. బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, వడ్డాది పాఠశాలలు, కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన కారణంగా అంటురోగాలు ప్రబలే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఇ.నర్సింహమూర్తి, హెచ్‌ఎం దుర్గాభవాని, జ్యోతి, జెటిక మూర్తి, సత్యం, అంగన్‌వాడీలు జ్యోతి, కృష్ణవేణి, హెచ్‌వి ఆదిలక్ష్మి, ఎఎన్ఎం జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వడ్డాదిలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : 9 మందికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- అరకులోయ

అరకులోయ పంచాయతీ మట్టగుడ వద్ద గురువారం జరిగిన ఆటోబోల్తా ప్రమాదంలో 9 మంది పిటిజి గిరిజనులకు తీవ్రగాయాలయ్యాయి. బోడగుడ వద్ద కాఫీ గింజల సేకరణకు వెళ్లిన సుంకరిమెట్ట పంచాయతీ దాబుగుడకు చెందిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో స్వగ్రామం వస్తుండగా, ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదసమయంలో ఆటోలో 13 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో బురడ రోజా, బి.దేవి, బి.చిన్న, బి.సునీల్, బి.సుశీల, బి.సుమి, బి.సత్యకుమార్, బి.లక్ష్మి, బి.కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. సంఘటనపై అరకులోయ ఎస్ఐ సురేష్ ఆధ్వర్యాన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రులను గిరిజనసంఘం నేతలు రామారావు, చిన్నబాబు, ఆనంద్, ప్రసాద్ తదితరులు పరామర్శించి, వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

వరి కుప్ప దగ్ధం

ప్రజాశక్తి- నాతవరం

మండలంలో యంబి పట్నం గ్రామంలో రైతు పల్లి రమణకు చెందిన వరి కుప్ప గురువారం దగ్ధమైంది. సుమారు 5 ఎకరాల పొలం నూర్పి బుధవారం కుప్ప పెట్టామని రైతు తెలిపాడు. దగ్ధంతో సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు. వరి కుప్పను జెడ్పిటిసి కరక సత్యనారాయణ పరిశీలించారు.


దగ్ధమైన వరి కుప్ప

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వడ్డాది

బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామంలో జన్మభూమిలో మంజూరైన వీవర్స్ పింఛన్లను గురువారం ఎంపిటిసి దొండా శ్రీను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీవర్స్ సొసైటీ తరఫున శాలి, దేవాంగుల్లో 50 ఏళ్ల పైబడిన వారికి పింఛను మంజూరు చేస్తారన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు వివిధ పథకాలు, రుణాలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అదర్రాప్ వరహాలుబాబు, సాయం శేషు, చేనేత కార్మికులు చప్పా శ్రీను, కన్నయ్య, మహేష్, శరగడం జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.


పింఛను బాండును ఇస్తున్న ఎంపిటిసి

'జన్మభూమి'పై ర్యాలీ

ప్రజాశక్తి-కొత్తకోట

జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తకోటలో జూనియర్ కళాశాల, టి.అర్జాపురంలో జడ్పీ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓడిఎఫ్ గ్రామాలపై అవగాహన కల్పించారు. కొత్తకోట ప్రిన్సిపల్ చంద్రశేఖర్, కోఆర్డినేటర్ హేమంత్, సమన్వయకర్త రాజేష్, టి.అర్జాపురంలో మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు, హెచ్‌ఎం జగన్నా దీక్షరావు, సిఆర్‌పి రామారావు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న సిబ్బంది

6 నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - వడ్డాది

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన ఈనెల 6 నుంచి 10 వరకు మాడుగుల మండం వీరవల్లి అగ్రహారం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నామని ఎన్ఎస్ఎస్ అధికారి ఇ.నర్సింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ శిబిరంలో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొం టారన్నారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, మార్నింగ్ స్టడీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

మండలంలోని సీతయ్యపేట పాల సేకరణ కేంద్రంలో గురువారం విశాఖ డెయిరీ పండుగ బోనస్‌ను గోకివాడ కోటేశ్వరరావు, ఎంపిటిసి వజ్రపు శ్రీనుల ఆధ్వర్యంలో పాడిరైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ డెయిరీ పాడిరైతులకు అనేక సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ ఎస్ గణేష్‌కుమార్, సూపర్‌వైజర్ అప్పారావు, కార్యదర్శి పిల్లా నారాయణరావు, తాళ్లపురెడ్డి అప్పలనాయుడు, అధ్యక్షులు కరణం నాగేశ్వరరావు, నందవరపు రాజులు, పాడిరైతులు పాల్గొన్నారు.


నగదును పంపిణీ చేస్తున్న సభ్యులు

భూ సమస్యలపై సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - రావికమతం

మండలంలోని బాదనపాడు, బుడ్డిబంద, పి.గడబపాలెం తదితర గ్రామాల్లో భూ సమస్యలపై తహశీల్దార్, సిట్ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ కె.శివాజీకి విశాఖలో ఫిర్యాదు చేసినట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవింద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామాల్లోని నిరుపేద గిరిజన, దళితులను మోసం చేస్తూ వారి వద్ద ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించుకొంటున్నారని తెలిపారు. స్పందించిన కమిషన్ చైర్మన్ ఈనెల 30న జాయింట్ కలెక్టర్‌తో సమావేశాన్ని ఏర్పాటుచేసి భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారని గోవింద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎరకన్న దొర, గిరిజన, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న గోవింద్

సీతయ్యపేటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

మండలంలోని సీతయ్యపేట జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని పాఠశాల హెచ్‌ఎం బి.కోటేశ్వరరావు, సర్పంచ్ కె.లక్ష్మి నాగేష్, ఎంపిటిసి వజ్రపు శ్రీను, మాజీ జెడ్‌పిటిసి గోకివాడ కోటేశ్వరరావు, సమర సత సేవా ట్రస్ట్ ఇన్‌ఛార్జ్ నరసింహాచారి(చారి) తదితరులు ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కలిమి శ్రీను, సేవా సంస్థ కన్వీనర్ జి.పోతురాజునాయుడు, కోకన్వీనర్ ఎంవి నాగేశ్వరరావు, ఎస్.రాము, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన రోగులు

సినిమా... సినిమా



అనకాపల్లిలో సినిమాలు

పట్టణంలో సినిమాలు...

రామచంద్ర	ది కంట్రీస్
రాజా	ఒక్క క్షణం
సత్యనారాయణ	హలో
శ్రీ సత్యనారాయణ స్క్రీన్ 2-	జుమాంజి
షిర్డిసాయి	నీ ప్రేమే నా ప్రాణం
పర్తిసాయి	ఎంసిఎ
వెంకటేశ్వర	ప్రాజెక్టు జెడ్

చోడవరం

సాయిలక్ష్మి	- ఎంసిఎ
శ్రీసాయిలక్ష్మి	- హలో
సాయిసిరిమేక్స్	- దేవిశ్రీప్రసాద్
పూర్ణ	-మళ్లీరావా..

నర్సీపట్నం

శ్రీకన్య :	జవాన్
కన్య :	లచ్చి
కన్యమినీ :	రాజా ది గ్రేట్
సాయిశ్రీకన్య :	10
రాజు మూవీమేక్స్ :	సీత రాముని కోసం
బంగార్రాజు :	సప్తగిరి ఎల్ఎల్‌బి

'ఉపాధి' కూలీలకు గునపాలు పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

మండలంలోని పెదపూడి గ్రామంలో ఉపాధి కూలీలకు గునపాలను సర్పంచ్ సారిపల్లి అప్పలనర్స గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ, గతంలో గ్రామానికి ఉపాధి హామీ పథకం ద్వారా 256 గునపాలు మంజూరయ్యాయన్నారు. వీటిని అధికారులు పంపిణీ చేయలేదన్నారు. దీనిపై అధికారులు లబ్ధిదారులు ప్రశ్నించగా పంపిణీ చేశామని సమాధానం చెప్పడంతో సహ చట్టం ద్వారా ఫిర్యాదు చేసి రికవరీ అయిన 120 గునపాలను అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోకివాడ వరకృష్ణ, కె.సాయిరామ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను పరిశీలన

ప్రజాశక్తి - దేవరాపల్లి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను అధికారుల బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ఆర్‌టిసి సేవలపై వినియోగదారులను అడిగి తెలుసు కున్నారు. దేవరాపల్లిలో బస్‌పాస్‌ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. వనిత కార్డులు ఇచ్చినప్పటికీ అనకాపల్లి బస్సు తప్పా మిగతా వాటికి అనుమతించ లేదని వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని వెత్సా సన్యాసిగుప్తా, సిద్ధు, కొల్లి రాంబాబు అధికారులను కోరారు. ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.జయరావ్ స్పందిస్తూ దేవరాపల్లిలో ఆర్‌టిసి బస్‌పాస్‌ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని బస్సులకు వనితకార్డులు అనుమతించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ప్రాఫిట్ మేనేజర్ కె.బ్రహ్మానందరెడ్డి, ఆర్‌ఎం జి.సుదీష్‌కుమార్, సుధ, బిందు, కె.వెంకటరావు, సుధాకర్, సింహాచలం డిపో మేనేజర్ హెచ్ దివ్య, వివిన్ రాజు పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

మొదటి పేజీ తరువాయి

మహిళలకు రక్షణ కరువు..!

చేసిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. నిన్నటికి నిన్న విశాఖపట్నం ఎస్ఇజెడ్‌లో ఒక గిరిజన మూగ బాలికను వివస్త్రను చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారే ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి సస్పెన్షన్‌కు గురైన సంఘటన బుధవారం వెలుగుచూసింది. దీన్ని బట్టి నగరంలో మహిళలకు రక్షణ లేదని, కామాంధులను రక్షక భటులే కాపాడుతున్నారని అర్ధమవుతోంది.

విశాఖ సిటీ పోలీసు కమిషనర్ పరిధిలోని 23 పోలీస్‌స్టేషన్లలో గత సంవత్సరం కూడా భారీ సంఖ్యలోనే అత్యాచారాలు నమోదయ్యాయని పోలీసు రికార్డులే చెబుతున్నాయి. ఈ సంవత్సరం ఆరంభమైన మలి రోజు నుంచే అత్యాచారాలు, అమానుషాలు నమోదవుతూ వస్తున్నాయి. జెర్రిపోతులపాలెంలో ఓ దళిత మహిళను వివస్త్రను చేసిన ఘటన జరిగిన 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన ఓ నిజాయితీ గల పోలీసు అధికారిని అక్కడి విధుల నుంచి తొలగించి, ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా అవమానించిందీ ప్రభుత్వం. ఎస్ఇజెడ్‌లో మూగ గిరిజన బాలికను ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. ఆ ఘనుడు చేసిన నేరం బయటకు రాకుండా బాధిత కుటుంబానికి డబ్బు ఇచ్చి తన నేరాన్ని తుడిచేసుకోవాలని ప్రయత్నించాడు. మీడియా రంగంలోకి దిగడంతో విధిలేక పోలీసులు కేసు నమోదు చేసి, సదరు వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల సమస్యలు సద్దుమణగక ముందే మూడో పట్టణ సిఐ బెండి వెంకటరావు ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న నేరంపై సస్పెండ్‌కు గురయ్యాడు. ప్రాణం కన్నా శీలం గొప్పదని భావించే మహిళలను వేధిస్తున్న దుర్మార్గుల పట్ల పోలీసుశాఖ ఎందుకు కఠినంగా వ్యవహరించలేకపోతుందోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. అత్యాచార నేరాన్ని కోర్టులో పగడ్బందీ సాక్ష్యాలతో నిరూపించి, సదరు నిందితునికి గట్టి శిక్ష పడేట్టు చేస్తే ఇటువంటి నేరాలు తగ్గే అవకాశం ఉంటుంది. కానీ, ఇప్పటివరకూ నమోదైన కేసులలో ఎంత మందికి శిక్ష పడిందని చూస్తే నివ్వెరపోయే సమాధానం కనిపిస్తోంది. పోలీసుల చార్జిషీట్లో డొల్లతనం మగాళ్లను కాపాడుకుంటూ వస్తోంది. అత్యాచార నిందితులను ఏదో విధంగా ఆ నేరం నుంచి తప్పించేందుకు సమాజంలో పలుకుబడి ఉన్న వర్గాలన్నీ కాపుకాయడం వల్ల ఇటువంటి అమానుషాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రశాంతంగా ఉండే విశాఖ నగరంలో నేరాలు ఇంతగా పెరిగిపోవడానికి పోలీస్ అంటే భయం లేకపోవడం, చట్టం అంటే గౌరవం లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. పోలీసు అధికారులే తమ వద్దకు న్యాయం చేయాలని వస్తున్న మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడటం శోచనీయం. ఇటీవల ఒక మహిళ విషయంలో రౌడీషీటర్‌ను హత్య చేయించి కటకటలాపాలైన డిఎస్పీ దాసరి రవిబాబు సంఘటన మరువక ముందే త్రీటౌన్ సిఐ బెండి వెంకటరావు తన వద్దకు వచ్చిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడి సస్పెండ్‌కు గురవ్వడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

జన్మభూమి పూర్తయ్యేనాటికి వినతులన్నీ పరిష్కరించాలి

పరిష్కరించాలన్నారు. అవసరమైతే కార్యాలయాల్లో రేయింబవళ్లు ఉండి పిటిషన్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినతుల అందజేసినవారికి వెంటనే వారి మొబైల్స్‌కు ఆన్‌లైన్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏరోజుకారోజు పిటిషన్లను ఆర్థిక, ఆర్థికేతర, వ్యక్తిగత, సామూహిక వినతులుగా విడగొట్టి, వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. అంశాల వారీగా ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాగ్ ఆధారంగా ప్రజలు వేటిపై ఎక్కువ సంతృప్తిని వ్యక్తం చేశారు, వేటిపై అసంతృప్తిని వ్యక్తం చేశారో తెలియజేస్తూ రేటింగ్ జాబితాను రూపొందించాలన్నారు. టాప్‌టెన్, లాస్టు టెన్‌పై ప్రత్యేక దృష్టి సూరిస్తూ, టాప్ టెన్, లాస్టు టెన్ ర్యాంకింగ్ రావడాన్ని విశ్లేషించాలన్నారు. పంచాయతీరాజ్, హెల్త్, డ్వాక్రా, వెటర్నరీ తదితర శాఖ ర్యాంకింగ్‌లు అదమంగా ఉండటానికి గల కారణాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు వివరణ అందజేయాలని అదేశించారు. శుక్రవారం విద్య-వికాశం అంశంపై చర్చలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ ఈ చర్చల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి చంద్రమౌళి, జన్మభూమి కార్యక్రమం జిల్లా ప్రత్యేక అధికారి వైవి అనురాధ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులతో పాటు రాష్ట్రస్థాయి రియల్ టైమ్ గవర్నెన్స్, కేంద్ర నుంచి అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం

శుక్రవారం నర్సీపట్నంలోని ధర్మసాగర్‌లో జరగనున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవివిఎస్.మూర్తి, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ స్వాగతం పలికారు.

పాఠశాలల్లో వసతులకు రూ.5,200 కోట్లు

పకడ్బంధీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధిలో మోడల్ స్టేట్‌గా తయారు చేయడానికి పూనుకున్నామన్నారు. ప్రయివేటు విద్యావ్యవస్థలో స్టడీ అవర్స్‌ను తగ్గించి, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చేయడమే కాకుండా, ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్స్ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, టిడిపి నాయకులు పినపోలు వెంకటేశ్వర్లు, సీతా వెంకటరమణ, సుగర్స్ ఎండి కెఆర్ విక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నుంచి పోటీ చేయకూడదా ?

వచ్చే ఎన్నికల్లో చోడవరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదా అంటూ మంత్రి గంటా ప్రశ్నించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు మీరు వచ్చే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఏం చోడవరం నుంచి పోటీ చేయకూడదా అని ఆయన బదులిచ్చారు. దీంతో అక్కడున్న వారు ఒక్కసారిగా చప్పట్లు చరిచారు. గంటా ఈ ప్రకటనపై నియోజకవర్గంలో చర్చ మొదలైంది. గతంలోనూ గంటా తనయుడు జయదేవ్ తీసిన సినిమా రిలీజ్ ముందు చోడవరం వచ్చినప్పుడు తాను చోడవరం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పట్లో ఇదేమీ లేదన్నట్లుగా ఆయన అనుచరులు తోసిపుచ్చినా, ప్రస్తుతం గంటా మాటల్లో మాత్రం చోడవరం మీద ఇంకా మమకారం తగ్గలేనట్లు కనబడుతుంది. గతంలోనూ ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసి తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు.

కొత్తవారికి సంక్షేమ లబ్ధినివ్వని 'జన్మభూమి'

- అధికార పార్టీ సభ్యుల్లోనూ అసహనం
- మధ్యేమార్గంగా ముఖం చాటేస్తున్న నేతలు

ప్రజాశక్తి - చోడవరం

జన్మభూమిలో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు అందజేస్తారని ఆశించిన లబ్ధిదారులకు నిరాశ తప్పలేదు. గతంలో మాదిరిగానే పథకాలను ఏకరవు పెట్టడమే కాక హామీలివ్వడం, అర్జీలు తీసుకోవడం ఐదవవిడతలోనూ షరా మామూలుగా మొదలైంది. దీంతో అధికార పార్టీ శ్రేణుల్లోనూ అసహనం ఆవరించింది. కొంతమంది జన్మభూమి కమిటీ సభ్యులయితే ఏదో కంటి తుడుపుగా వచ్చినట్లు వచ్చి గ్రామసభలో కిమ్మనకుండా కూర్చొన్నారు. ఏడాది కాలంగా పింఛన్లు, ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం అర్జీలు పెట్టుకొన్న వారికి ఈ జన్మభూమిలో పంపిణీ చేస్తామంటూ కొన్నాళ్లుగా అధికార పార్టీ నేతలు ఆశలు కల్పిస్తూ వచ్చారు. తీరా సభల్లో పంపిణీ జరగకపోగా, పింఛన్లు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, అనర్హులు ఉన్నందున, వారిని తొలగించిన తర్వాతే అర్జీదారులకు ఇస్తామని చెప్పడంతో పలువురు లబ్ధిదారులు పెదవివిరుస్తున్నారు.

పింఛన్లు కోసం మండలంలోనే సుమారుగా 2 వేల మంది వరకు దరఖాస్తు చేసుకుంటే, నియోజకవర్గానికి 2 వేల పింఛన్లు మంజూరు కావడంతో, అవి ఎవరికి ఇవ్వాలో తెలియక అధికారులు, నేతలు తలలు పట్టుకుంటూ పంపణీని పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లుగా గొప్పలు చెప్పుకుంటూ హడావుడి చేసిన తెలుగుతమ్ముళ్లు దీంతో తుస్సుమని గాలితీసినట్లు మిన్నకున్నారు. మండలంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఎంపిపి, జెడ్‌పిటిసి, ఇతర ద్వితీయ శ్రేణి నాయకులెవరూ హాజరు కాకపోవడం వారి అసహనాన్ని స్పష్టమౌతోందని పలువురు అంటున్నారు. గ్రామాల్లోకి వెళితే ప్రజలు పథకాలపై అడుగుతారన్న బెంగతో నాయకులు జన్మభూమి సభలకు రానట్లు తెలుస్తోంది.

మాతృవియోగంతో ఎమ్మెల్యే రాజు ఇంటికే పరిమితం కావడంతో ద్వితీయశ్రేణి నాయకులు సభలకు ముఖం చాటేసారని అంటున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు అర్హులకు ఇస్తామని అధికారులు ప్రకటిస్తున్నా, వారి మాటలు భరోసానివ్వని పరిస్థితుల్లో నేతలు ఏంచేయాలో పాలుపోని పరిస్థితుల్లో దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఎవరికి పింఛన్లు, రేషన్‌కార్డులు వస్తాయో తెలియని పరిస్థితుల్లో నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

బోయ , వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న

అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలి : పౌరహక్కుల సంఘం

ప్రజాశక్తి-పాడేరు

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి జె.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందున్న బోయలు ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్‌లతో మరింత ముందుకు దూసుకుపోతారని, గిరిజనులు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా మిగిలిపోతారన్నారు. తక్షణమే ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పాడేరు

మూగ బాలికలపై అత్యాచారం చేసిన హెచ్‌బిఎల్ ప్రయివేట్ లిమిటెడ్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న సిహెచ్.విశ్వనాథంను కఠినంగా శిక్షించాలని గిరిజన మహిళా హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఎస్.గంగరాజులు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు శెట్టి శాంతికుమారి డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ అభం శుభం తెలియని మూగ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని ఊరికే వదిలిపెట్టకూడదన్నారు. సమాజంలో నానాటికీ మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు.

సమస్యల పరిష్కార వేదిక 'జన్మభూమి'

కోటవురట్ల : ప్రజా సమస్యలను పరిష్కరించే వేదిక జన్మభూమియని రాష్ట్ర పరిశీలకులు రవిశంకర్ అన్నారు. గురువారం మండలంలోని పికెపల్లి, అక్సాహెబ్‌పేట, తంగేడు, లింగాపురం గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగాపురం జన్మభూమిలో ఎమ్మెల్యే అనిత హాజరయ్యారు. అక్సాహెబ్‌పేట, తంగేడు గ్రామాల్లో రాష్ట్ర పరిశీలకులు రవిశంకర్ మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి త్వరితగతిన బిల్లులు చెల్లించాలన్నారు. పికెపల్లి, తంగేడు, లింగాపురం గ్రామాల్లో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీధర్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిపి వరహాలమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న రవిశంకర్

చంద్రన్న బీమా పరిహారం పంపిణీ



బీమా పరిహారం అందిస్తున్న బాబ్జి

గొలుగొండ : మండలంలో జోగుంపేట గ్రామంలో గత నెలలో మృతి చెందిన నక్కా రాంబాబు కుటుంబ సభ్యులకు గురువారం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సుర్ల బాబ్జీ చేతుల మీదుగా చంద్రన్న బీమా సొమ్మును అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న బీమా ద్వారా మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తుందని చెప్పారు. 49 ఏళ్ల లోపు చనిపోయిన వారికి రూ.2లక్షలు వస్తుందన్నారు. ప్రస్తుతం రాంబాబు కుటుంబానికి ముందుగా రూ.5 వేలు అందిస్తామని, మిగిలిన సొమ్ము ఆయన నామినీల బ్యాంకు ఖాతాకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు బీమా మిత్ర శారద, పంచాయితీ కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-హుకుంపేట

మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామ సమీపంలో వెనకబడిన విద్యార్థులకు పాఠశాల నిర్మాణానికి సంబంధించి ట్రైన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు తిరుపతిరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పాఠశాల నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా పలు కర్యాక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పుణ్యారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కోటేశ్వరరావును విడుదల చేయాలి : గిరిజన సంఘం



దుంబ్రిగుడలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ

జికె.వీధి మండలం దారకొండలో సెల్‌టవర్ పేల్చివేత సంఘటనలో విచారణ పేరుతో రిమాండ్‌కు తరలించిన గిరిజన సంఘం నాయకుడు కోటేశ్వరరావును విడుదల చేయాలని గిరిజన సంఘం మండల ప్రధానకార్యదర్శి టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అరకులో గిరిజన సంఘం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 16న జికె.వీధి మండల దారకొండలో మావోయిస్టులు సెల్‌టవర్‌ను పేల్చేసిన ఘటనలో విచారణ పేరుతో గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావును పోలీసులు స్టేషన్‌కు తరలించి చిత్రహింసలకు గురిచేసి అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు తరలించడం సరికాదన్నారు. నిత్యం నిరుపేద ప్రజల పక్షాన ఉండి నీతి నిజాయితీతో గిరిజన సంఘం పనిచేస్తుందన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ పనిచేసే గిరిజన సంఘం నాయకుల్ని పోలీసులు విచారణ పేరుతో అరెస్టు చేయడం సబబు కాదన్నారు. తక్షణమే కోటేశ్వరరావును విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు పి.సురేష్, మండల నాయకులు సత్యనారాయణ, నూకరాజు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

అనంతగిరి : జికె.వీధి మండల గిరిజన సంఘం నాయకులు కోటేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు డి.గంగరాజు, మండల నాయకులు కె.మొశ్య డిమాండ్ చేశారు. గురువారం రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసే గిరిజన సంఘం నాయకుడు కోటేశ్వరరావును అన్యాయంగా అరెస్టు చేయడం



అనంతగిరిలో మాట్లాడుతున్న ఎపిజిఎస్ నాయకులు

సరికాదన్నారు. తక్షణమే కోటేశ్వరరావును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎపిజిఎస్ నాయకులు చిన్నారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు : ధారకొండ సెల్‌టవర్ పేల్చేసిన ఘటనలో గిరిజన సంఘ: నేత బాకూరు కోటేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని, తక్షణమే ఆయనను విడిచిపెట్టాలని ఎపిజిఎస్ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన కోటేశ్వరరావును అన్యాయంగా అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో ఎపిజిఎస్ నాయకులు కె.నీలకంఠం, బి.గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

అరకు రూరల్ : గిరిజన సంఘం నాయకుడు బాకూరు కోటేశ్వరరావును వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఎపిజిఎస్ మండల కార్యదర్శి రామారావు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో సంబంధం ఉందని అమాయక గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఎన్నో సమస్యలపై కోటేశ్వరరావు పోరాటాలు చేశాడని, అటువంటి వ్యక్తిని సంఘ విద్రోహశక్తిగా ముద్రవేసి జైలులో పెట్టడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హకరి, రామనర్న, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, లక్ష్మణ్ పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల నూతన కార్యవర్గం

పాడేరు : ఐటిడిఎ పరిధిలోని 36 పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం స్థానిక ఎపిజిఎస్ కార్యాలయంలో జరిగింది. గిరిజన వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో డివిజన్ అధ్యక్షులుగా సప్పి బాలయ్య, కార్యదర్శిగా పాతుని మహేష్‌పాత్రుడు, న్యాయ సలహాదారుడిగా కంబిడి లక్ష్మణరావు, మహిళా ప్రతినిధిగా సుమాంజలి కోశాధికారిగా జగన్నాథం, గౌరవ అధ్యక్షులుగా శెట్టి నాగరాజు, ఉపాధ్యక్షులుగా గంగాధర్, శంకర్, దేశి, చిట్టిబాబు, సింహాచలం, లక్ష్మణ్, పుష్పవతి, కల్యాణి, రేవతి, సహాయ కార్యదర్శులుగా భూపతిరాజు, పుష్ప, బాలయ్యదొర, క్రాంతి, రాంబాబు, ఉపేంద్ర, గౌరీ, ఈశ్వరమ్మ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

బాలరాజును విమర్శించే నైతికహక్కు లేదు : కాంగ్రెస్

ప్రజాశక్తి-పాడేరు రూరల్

టిడిపి ఇచ్చిన సొమ్ములకు అమ్ముడుపోయి నీచ రాజకీయాలు చేసే పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజును విమర్శించే హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షులు బూర దేముళ్లు అన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరిస్తారని నమ్మి ఓట్లు వేసిన గిరిజనులను నట్టేట వదిలేసి, ఎమ్మెల్యే ఈశ్వరి టిడిపిలో చేరగా, గిరిజనుల ఓట్లతో గెలిచి మంత్రిగా వారి సమస్యలు పరిష్కరించి, గిరిజనాభివృద్ధికి సహకరించిన బాలరాజును విమర్శించడం ఎంతవరకు సబబో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇకమీదట బాలరాజుపై తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం, గిరిజనులపై చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, మళ్లీ పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. సమావేశంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు తమర్భ కృష్ణవేణి, మంగ్లన్నదొర, కార్యదర్శులు, పి.సత్తిబాబు, ఎస్.సూర్యనారాయణ, వనుగుపల్లి సర్పంచ్ పాంగి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు కన్నాపాత్రుడు, జిల్లా అధికార ప్రతినిధి తుడుము అశోక్, పిసిసి మహిళా విభాగం నాయకులు మణి, మాజీ సర్పంచ్ సూరిబాబు, భాస్కరరావు, రమణ, త్రినాథ్, మూర్తి, నాగేశ్వరరావు, చిన్నారావు, ఎం.బాలు, బి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ



పెదబయలులో కాలేజీ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-పెదబయలు

పెదబయలు గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంతో కలిగే ఉపయోగాలపై గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి పురవీధుల మీదుగా మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ సాగింది. పరిసరాలు-పరిశుభ్రత, స్వచ్ఛభారత్, మొక్కల పెంపకంపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను నిర్మించుకోవాలి

పాడేరులో...

ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.భీమశంకరరావు కోరారు. గురువారం మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాలతో బహిరంగ మల విసర్జనను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.దీనికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని సూచించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో...

ప్రభుత్వం మంజూరు చేస్తున్న మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని కోరుతూ స్థానిక జూనియర్



దుంబ్రిగుడలో కస్తూర్బా విద్యార్థినుల ర్యాలీ

కళాశాల, కెజిబివి పాఠశాల విద్యార్థులు గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మూడు రోడ్ల కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రమీళ, కెజిబివి ప్రత్యేక అధికారిణి ఉమానాగేశ్వరి మాట్లాడుతూ మొక్కలు పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జె.అప్పలనాయుడు, కళాశాల, కెజిబివి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మరుగదొడ్ల నిర్మాణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కొండన్నదొర మాట్లాడుతూ ఆరోగ్యమైవన వాతావరణం ఉండాలంటే ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకొని బహిరంగ మల విసర్జనను విడనాడాలని కోరారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : మరుగుదొడ్లను నిర్మించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెఎన్ఎన్ఎస్.మూర్తి అన్నారు. గురువారంకించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించాలనంటూ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో కాలేజీ విద్యార్థుల ర్యాలీ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే , జెడ్‌పి ఛైర్‌పర్సన్

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతగిరి

2018 ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలో జరిగింది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ లాలం భవాని, అరకు నియోజకవర్గ శాసనసభ్యులు కిడారి సర్వేశ్వరరావు, ఎంపిపి పైడితల్లి, రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ పి.లక్ష్మి తదితరులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తిని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన సమస్యలపై నిరంతరం కథనాలు ప్రచురించే పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కొండిభ సర్పంచ్ రుక్మిణి, తహశీల్దార్ జయప్రకాష్, సిపిఎం నాయకులు గంగరాజు, కె.మొశ్య తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన జరుపుతున్న నేతలు, అధికారులు

7న మంత్రి లోకేష్ పర్యటన

ప్రజాశక్తి-అనంతగిరి

ఈ నెల 7వ తేదీ అనంతగిరిలో జన్మభూమి గ్రామసభలో రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నట్టు అరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవానీ తెలిపారు. గురువారం మండలంలో పర్యటించిన వారు హరిత హిల్ రిసార్ట్స్ వద్ద ఏర్పాటుచేయనున్న సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జన్మభూమిలో పాల్గొనే లోకేష్, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. విద్యార్థులతో నిర్వహించే పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో గిరిజనులు హాజరై మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ డికె.బాలజీ, జెడ్‌పి వైస్ ఛైర్మన్ అప్పారావు, రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మి, ఎంపిపి జి.పైడితల్లి, టిడిపి మండల నాయకులు ఆనంద్, కె.బుజ్జిబాబు, సిహెచ్.రాజ్‌కుమార్, అప్పారావు, సిఐ వెంకినాయుడు, అనంతగిరి ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

నేడు పెదబయలులో 'జన్మభూమి' 5కె రన్

పెదబయలు : ఈ నెల 5వ తేదీన పెదబయలు మండల కేంద్రంలో జన్మభూమి 5కె రన్ నిర్వహిస్తున్నట్టు ఎంఇఒ కె.సింహాచలం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హాజరుకానున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ఆసక్తిగల యువత, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

7న ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు : ఈ నెల 7వ తేదీ ఆదివారం 5కె రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ కె.ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 5వ జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు 5కె రన్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల యువతీ, యువకులు, ఎంపిపి, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, గిరిజనులు ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం
శుక్రవారం 5 జనవరి 2018

చరిత్ర ఘనం.. ఆలయాలు కడుదీనం

ఈ ఆలయాల చరిత్ర చూస్తే ఘనం.. కానీ వాటి పరిస్థితి చూస్తే దయనీయం.. ఇదీ రోలుగుంట మండలంలోని పురాతన మందిరాల దుస్థితి. ముందు బాగానే ఉన్నా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లిన తర్వాత పట్టించుకోవడం మానేశారు. శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. చెరిగిపోతున్న 118 ఏళ్ల నాటి ఆనవాళ్లపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రోలుగుంటలోని పురాతన మందిరాల దుస్థితి
చెరిగిపోతున్న 118 ఏళ్ల నాటి ఆనవాళ్లు



శిథిలావస్థలో సత్యనారాయణస్వామి గుడ్డి

ప్రజాశక్తి-రోలుగుంట
రోలుగుంటకు పశ్చిమ దిశలో ఉన్న కొండ మీద ముత్యాల రామస్వామి తదితరులు 1910లో కొండలను తొలిచి సత్యనారాయణ స్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి, జగన్నాధస్వామి (జగ్గారాయడి గుడి), కాస్త దిగువన రామాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాల్లో అర్చకత్వం చేసేందుకు కశింకోట ప్రాంతానికి చెందిన నర్సింహాచార్యుల కుటుంబాన్ని ఇక్కడకు రప్పించారు. ప్రస్తుతం అదే కుటుంబానికి చెందిన వారసులు ఇక్కడ అర్చకత్వం కొనసాగిస్తున్నారు. అప్పట్లో ముత్యాల వారి వంశీయులు ఆలయాల నిర్వహణ నిమిత్తం సుమారు 11 ఎకరాల భూమిని ధానంగా ఇచ్చారు. వారి ఆధ్యాత్మికతకు ఇదే ప్రాంతానికి చెందిన మరికొంత మంది తోడై ఒక్కొక్కరు ఎకరం, అర ఎకరం చొప్పున భూములను స్వామి వార్లకు విరాళంగా ఇచ్చారు. వెరసి ఇప్పుడా భూమి సుమారు 18 ఎకరాలకు చేరింది. ఈ భూములను కౌలుకు ఇచ్చి, వచ్చిన ఆదాయంతో ఆలయాల్లో దీప, దూప నైవేద్యాలకు వినియోగిస్తూ వస్తున్నారు.

దేవాదాయశాఖ ఆధీనంలో భూములు

కాలక్రమంలో ఈ భూములను దేవాదాయశాఖ సొంతం చేసుకుంది. అప్పటి నుంచి ఆలయాల పరిరక్షణ కరువైంది. దీంతో ఆలయాలు శిథిలమైపోయాయి. అలనాడు ఆలయాలపై చెక్కిన అద్భుత శిల్ప సౌందర్యం, కళానైపుణ్యం చెదిరిపోయింది. వెంకటేశ్వరస్వామి, రామాలయం కొంత మంది దాతల సహాయంతో కాస్త మెరుగయ్యాయి. వీటికి మరమ్మతులు చేయించారు. ఫ్లోరింగ్ పనులు, ఇనుప చట్రాల బిగింపుతో తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటిలో పూజలు, అర్చనలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి.

యువత సహకారం

ఇలా విరాళాలతో వృద్ధి చెందుతున్న సందర్భాలను ఇక్కడ యువత జ్ఞప్తికి తెచ్చుకొని జగ్గారాయుడి గుడికి ఇతోధికరంగా సహకరించారు. రెండేళ్ల క్రితం శ్రమధానంతో మెట్లను నిర్మించడంతో పాటు గ్రిల్స్, ఫ్లోరింగ్ అమర్చి ఓరూపానికి తీసుకొచ్చారు. ఇవి ఊరికి దూరంగా కొండ మీద ఉండటంతో ఆకతాయిలకు నిలయాలుగా తయారవుతున్నాయి. కొందరు ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలను కొనసాగిస్తూ భక్తుల అధ్యాత్మిక చింతనకు తూట్లు పొడుస్తున్నారు. పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పండగ సమయాల్లో ఆలయాలకు వస్తున్న భక్తులు ఇక్కడి పరిస్థితిని చూపి మనోవేదన చెందుతున్నారు. మరికొందరు స్వతహాగా స్పందించి వీటిని శుభ్రం చేస్తున్నారు. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఆలయాలపై దృష్టిసారించి అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అధ్యాత్మికంగా పేరు తెచ్చుకునే అవకాశముంది.

నగర సంకీర్తన అవసరం

గ్రామంలో పురాతన ఆలయాలు ఉండటం ఎంతో విశిష్టతతో కూడిన వ్యవహారం. అంతటి ప్రఖ్యాతిగాంచిన వీటి ఆనవాళు చెదిరిపోకుండా ఉండేలా కొన్ని కార్యక్రమాలను కొనసాగించాలి. గ్రామస్తులు తరచూ నగర సంకీర్తన చేస్తుండాలి. నిర్దేశించిన సమయాల్లో కల్యాణోత్సవాలు జరిపించాలి. వీటిని కొన్నైనా అవలంభిస్తే మంచిది.

- రేజేటి శ్రీమాన్ శ్రీనివాసాచార్యులు, అర్చకుడు,.

శీతాకాలంలో పశు సంరక్షణ.. జాగ్రత్తలు



గేదెను కడుగుతున్న రైతు

ప్రజాశక్తి-నర్సీపటనం రూరల్
వాతావరణంలో సంభవించే మార్పులకు పశువులలో సంక్రమించే వ్యాధులకు చాలా దగ్గర సంబంధం ఉండడం వల్ల వ్యాధులను కలగజేసే వ్యాధికారక క్రిములు వాటికి అనుకూలమైన వాతావరణం పరిస్థితులలో విజంభిస్తాయి. పశువులను వ్యాధి బారిన పడేలా చేసి పశుపోషకులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనేలా చేస్తాయి. కాలానుగుణంగా సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పాడి రైతులు నష్టాల బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చు.

పశువులకు సంక్రమించే వ్యాధులు

గాలికుంటు వ్యాధి : ఇది ఒక రకమైన వైరస్ వల్ల ఒకే గాట వంటి వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువులలో తీవ్రమైన జ్వరంతో పాటు నోటి నుండి కోటార్, నోటిలోని పుండ్లు ఏర్పడడం, పాల దిగుబడి శాతానికి పడిపోవడం, లేగదూడలు మృతి చెందడం జరుగుతుంది. ఈ వ్యాధికి చికిత్స కన్నా నివారణ మేలు. వ్యాధి నివారణ టీకాలు ఫిబ్రవరి మరియు సెప్టెంబర్ నెలలో వేయించాలి.

కంఠవాపు వ్యాధి : ఇది ఒక రకం బ్యాక్టీరియా వల్ల వచ్చేటటువంటి వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువులకు కంఠ వాపు రావడం, నోటి నుండి గురక శబ్దం రావడం, తీవ్ర జ్వరంతో పశువు 24 గంటల్లో మరణించడం జరుగుతుంది. ఈ వ్యాధి గుర్తించిన వెంటనే పశువులకు యాంటీబయోటిక్స్ మరియు సలారే ఇంజక్షన్ ఇవ్వడం వల్ల వ్యాధి బారి నుంచి కాపాడుకోవచ్చు. వ్యాధి నివారణ టీకాలు తొలకరికి ముందు మే నెలలో వేయించుకోవాలి.


గోశాలలో పశువులు

జబ్బ వాపు వ్యాధి : బ్యాక్టీరియా వల్ల ఆవు జాతి పశువులకు వచ్చేటటువంటి వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువులు జ్వరంతో ఎటు కదలలేకపోవడం, కాలు వాపు రావడం, మేత మేయకపోవడం, వైద్యం అందక మరణించడం కూడా జరుగుతుంది. వ్యాధిని గుర్తించిన వెంటనే పెన్సిలిన్ ఇంజక్షన్ ఇచ్చినట్లయితే వెంటనే పశువు తేరుకుంటుంది. వ్యాధి నివారణ టీకాలు తొలకరికి ముందు ఏప్రిల్, మే నెలల్లో వేయించుకోవాలి.

న్యూమోనియా : ఈ వ్యాధి బాక్టీరియా మరియు వైరస్ వల్ల రావచ్చు. ఈ వ్యాధి సోకిన పశువులలో దగ్గు, చీమిడి కారడం, జ్వరం, మేత మేయకపోవడం, ఊపిరి పీల్చుకున్నప్పుడు ఇబ్బంది పడటం జరుగుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. యాంటీబయాటిక్స్ మందుని ఇప్పించి మంచు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కోల్డ్ స్ట్రస్ (హైపోథరిమియా) : సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుండా ఆరుబయట పశువులను కట్టడం వల్ల ఒకోసారి పశువులలో వేడి తగ్గి వణకడంతోపాటు, పడుకొని లేగకపోవడం, శ్వాస మందగించడం జరుగుతుంది. మీరు ఇటువంటి పశువులను గడ్డితో రుద్ది మంట వేసి వేడి పుట్టించడం, పశువులను పాకలో కట్టడం, కాల్షియం ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా తిరిగి మామూలు స్థితికి తీసుకు రావాలి .


పాకలో ఉన్న ఆవులు

పశువులను ఆరోగ్యంగా ఉంచాలి




పై తెలిపిన జాగ్రత్తలను పాటించినట్లయితే పాడి పశువులు ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా అధిక పాల దిగుబడిని సాధించవచ్చు అంతేగాకుండా నష్టాల నుండి బయటపడవచ్చు. రైతులు కాలానుగుణంగా వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

-డాక్టర్ సిహెచ్ గణేష్,
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ యానిమల్స్ హాస్య బెండ్, నర్సీపట్నం.

పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1.పశువుల షెడ్స్‌లోకి చల్లని గాలులు తగలకుండా తార్పాలిన్లు, గోను సంచులు, కర్టెన్లు కట్టుకోవాలి.
2.షెడ్స్‌లో, పాకల్లో సూర్యరశ్మి తగిలేటట్లుగా చూడాలి. షెడ్స్‌లో ఎక్కువ చమ్మ లేకుండా చూడాలి. శుభ్రం చేయాలి.
3.పశువులను బయట ఎండలో సూర్యరశ్మి తగిలేటట్లుగా ఉంచాలి. దీనివల్ల పశువులకు న్యుమోనియా, పారుడూ, జ్వరం రాకుండా కాపాడుకోవచ్చు.
4.పశువుల పాకలో పడుకునేటప్పుడు నేల మీద కాకుండా కింద వరి గడ్డి ఒత్తుగా వేసి పడుకునేట్లు చూడాలి. ముఖ్యంగా లేగదూడలను ఈ విధంగా చేసి సంరక్షించుకోవాలి.
5.చలి బాగా ఎక్కువగా ఉన్నప్పుడు పశువులను గోనె సంచులతో కప్పడం వల్ల ఒంట్లో వేడి తగ్గకుండా ఉంటుంది.
6.పాకలను రోజుకు రెండుసార్లు శుభ్రపరుచుకోవాలి, లేగదూడలకు వెంట్రుకలు కత్తిరించకూడదు, చన్నీటి స్నానం చేయించకూడదు, గోరువెచ్చని నీటితో స్నానం చేయించాలి.
7.పశువులకు సమతుల్య ఆహారాన్ని, సమీకత దానా ఇవ్వాలి, లేగూమ్ పౌడర్, ఎండు గడ్డితో కలిపి ఇవ్వాలి. దాణాలో ప్రోటీన్లు ఉండేటట్లు చూడాలి.


ఆరుబయట ఉన్న పశువులు

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అలుపెరగని పోరాటం సాగిస్తోంది. ప్రభుత్వం ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా, అణచివేతకు పాల్పడినా, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినా, ఏ మాత్రం వెనుదిరకుండా ప్రజల పక్షాన నిలబడుతుంది. ప్రజలెదుర్కొంటున్న స్థానిక సమస్యల నుంచి మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశకర విధానాలకు వరకు ప్రజా వ్యతిరేక విధాలన్నింటిపైనా ఉద్యమిస్తుంది. కార్మిక, కర్షక, గిరిజన, దళిత, వృత్తిదారులు ఇలా అన్ని వర్గాలకు అండగా ఉంటూ వస్తోంది. భూ సమస్యలపైనా, నిర్వాసితులకు పరిహారం, ఉపాధిపైనా పోరాడుతోంది. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో సిపిఎం ముందుంటుంది. ఈ నెల 6, 7, 8 తేదీల్లో అచ్యుతాపురంలో సిపిఎం జిల్లా మహాసభలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...

-ప్రజాశక్తి,విశాఖపట్నం ప్రతినిధి,.



బాక్సైట్ వ్యతిరేక బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ (ఫైల్)

సామాజిక సేవలోనూ సిపిఎం ప్రత్యేకం
రేపటి నుంచి అచ్యుతాపురంలో జిల్లా మహాసభలు



ఆదివాసీలకు తోడూ నీడ...

మన్యంలోని ఆదివాసీలకు సిపిఎం అండగా ఉంటుంది. వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ వారి మన్ననలు పొందింది. వారు నిత్యం ఎదుర్కొనే తాగునీరు, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు, ఇతర సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తుంది. వారి జీవనాన్ని చిధ్రం చేసే ఏ చర్యనైనా సిపిఎం వ్యతిరేకిస్తూ వస్తుంది. జ్వరం వచ్చినా, జబ్బు చేసినా వారికి సిపిఎం మాత్రమే కనిపిస్తుంది. అంతగా వారి గిరిజనుల్లో మమేకమైంది. పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఏజెన్సీలో పాదయాత్రలు నిర్వహించి ఆందోళనలు చేపట్టింది.

ఉపాధి నిధులు స్వాహా, బకాయిలపై..

ఏజెన్సీ 11 మండలాలతో పాటు గొలుగొండ, చీడికాడ మండలాల్లో ఉపాధి పనులు, మరుగుదొడ్ల నిధుల్లో సుమారు రూ.16కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకోగా, దానిపై సిపిఎం ఉద్యమించింది. గ్రామాల్లో సర్వేలు నిర్వహించి అవినీతి ఎంత మొత్తంలో జరిగిందో ఆధారాలతో సహా బయటపెట్టింది. ఈ సమస్యపై ఉద్యమించి డబ్బులను కాజేసిన వారిలో 74 మందిపై చర్యలు తీసుకొనేలా చేసింది. ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారిని చైతన్యం చేసి ఆందోళనలు చేసింది.


గిరిజనులకు వైద్యసేవలు అందించడానికి గుర్రంపై వెళ్తున్న డాక్టర్ (ఫైల్)

అక్రమ గ్రానైట్ తవ్వకాలపై

ఏజెన్సీలో, నాన్ షెడ్యుల్డ్ ఏరియాలో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా సిపిఎం పోరాడింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం వూరకొండలో గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన జిఒను రద్దు చేయాలని పోరాడింది. అనంతగిరి మండలం భీంపోలు, లువ్వా గ్రామాల్లో అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆందోళన చేయడంతో పాటు ఆ ప్రాంతంలో పర్యటనకు వచ్చిన మైనింగ్ మాఫియా, అధికారులను స్థానికులతో కలిసి అడ్డుకోవడం జరిగింది.

సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై...

జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీల సమస్యలపై సిపిఎం పోరాడింది. చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో రూ.8 కోట్ల అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలని, రైతులకు బకాయిలు చెల్లించాలని ఆందోళనలు నిర్వహించింది. అలాగే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని మూసివేయడాన్ని, దానిని విశాఖ డెయిరీకి అప్పగించాలని ప్రజా ప్రతినిధుల ఆలోచనను వ్యతిరేకిస్తూ పోరాటం చేసింది.

వివిధ సమస్యలపై పాదయాత్రలు

జిల్లాలోని తీరం, గిరిజన, నాన్‌షెడ్యూల్డ్ ఏరియాలతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాల్లోని 27 మండలాల్లో సిపిఎం పాదయాత్రలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. రైవాడ రైతులకు నీరు ఇవ్వాలని రాస్తారోకోలతో పాటు అక్కడి రైతులు, వివిధ సంఘాలను కలుపుకొని పాదయాత్ర నిర్వహించింది. కాఫీ రైతుల బకాయిలు, ప్రోత్సాహక నిధులు, అటవీ భూములకు పట్టాలు, రేషన్ కార్డులు, ఇళ్ల బకాయిలు, గృహాలు మంజూరు, రోడ్లు, మరుగుదొడ్ల వంటి సమస్యలపై ఈ యాత్రలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నాన్‌షెడ్యూల్డ్ ఏరియాలోని భూ సమస్యలు, అర్హులకు భూపట్టాలు, గ్రానైట్ తవ్వకాల అక్రమాలపైనా పాదయాత్రలు చేసింది.


బ్రాండిక్స్ కార్మికుల సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నేత లోకనాథం (ఫైల్)

భూ సమస్యలు - నిర్వాసితులు - పరిహారం - ఉపాధి..

జిల్లాలో భూ సమస్యలు, భూ సేకరణ, నిర్వాహితులకు అందాల్సిన పరిహారం, ఉపాధి వంటి అంశాలపై సిపిఎం ఉద్యమించింది. జిల్లాలో ఎస్ఇజెడ్, ఇతర పరిశ్రమలు, సంస్థల పేరుతో రైతులు, పేదల వద్ద భూములను ప్రభుత్వం లాక్కుంటున్న నేపథ్యంలో సిపిఎం జోక్యం చేసుకొని వారికి న్యాయమైన పరిహారం, ఉపాధి, ప్యాకేజీల కోసం పోరాటాలు నిర్వహించింది. నక్కపల్లి ఎస్ఇజెడ్, ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం, మునగకపాక, పరవాడ, అనకాపల్లి మండలాల్లోని లాజిస్టిక్ హబ్ తదితర చోట్ల నిర్వాసితుల తరుపున పోరాడింది. లాజిస్టిక్ హబ్ నిర్వాసితులకు ఎకరాకు 13 లక్షల రూపాయలు నష్టపరిహారం అందేలా చేసింది. అచ్యుతాపురం ఎన్‌టిపిసి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఎస్ఇజెడ్, రాంబిల్లి ఎన్ఎఒబి, పరవాడ పార్మాసిటీ సమస్యలపైనా అలుపెరగని పోరాటం సాగించింది. సబ్బవరం మండలం, వంగలి సేకరణపై పాదయాత్రలు, ఆందోళనలు నిర్వహించింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం ప్రాంతంలో ప్రభుత్వ అక్రమ భూ సేకరణపై ఉద్యమించింది. అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అనంతగిరిలో భూ కబ్జాలపై ఆందోళన చేసి 36 మందికి తిరిగి వారి భూములను వారికి అప్పగించడం జరిగింది.

మత్స్యసంపదను నాశనం చేసి మత్స్యకారుల వృత్తిని, ఉపాధిని దెబ్బతీసే విధంగా పూడిమడక సముద్రతీరంలోకి పైప్‌లైన్ ఏర్పాటుపై సిపిఎం బాధితులకు అండగా నిలిచింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆ గ్రామంలో పర్యటించి మద్దతు తెలియజేశారు. భీమిలి మండలంలోని దివీస్ లేబొరేటరీస్ కాలుష్యం నుండి ప్రజల్ని కాపాడాలని, దివీస్ విస్తరణ పనులు వెంటనే నిలుపుదల చేయాలని స్థానికులు చేసి న్యాయమైన పోరాటంలో భాగస్వామ్యమైంది. 140 రోజుల పాటు దీక్షలు చేపట్టడంతో దివీస్ యాజమాన్యం దిగొచ్చి విస్తరణ నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పెద్దేరు ఎడమ కాలువ నిర్మాణం చేపట్టి గిరిజన రైతులను ఆదుకోవాలని నిర్వహించిన పాదయాత్రతో ప్రభుత్వం ఆరు కోట్ల 50 లక్షలు మంజూరు చేసింది. గొలుగొండలో గిరిజనులు, దళితుల భూములను భూ స్వాములు ఆక్రమించాలని చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టి గిరిజనులు, దళితుల పక్షాన సిపిఎం నిలబడింది.

బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా...

జికె.వీధి మండలం, జర్రెల బ్లాక్‌లో బాక్సైట్ తవ్వకాల కోసం 2015 నవంబర్ 5న చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 97పై గిరిజనం బగ్గుమంది. గిరిజనుల జీవితాలను చిధ్రం చేసే, నీటి వనరులను, పర్యావరణాన్ని నాశనం చేసే బాక్సైట్ తవ్వకాలను మొదటి నుంచి వ్యతిరేకిస్తూ, సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం జిఒ 97ను రద్దు చేయాలని ఆందోళన ఉధృతం చేసింది. చైతన్య సమావేశాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, బంద్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసింది. అంతే కాకుండా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్‌తో చింతపల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. గిరిజనుల పోరాటానికి ప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఆ జిఒను తాత్కాలికంగా నిలుపుదల చేసింది.

కార్మిక పోరాటాలకు అండగా...

కార్మిక పోరాటాలకు సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటూ వచ్చింది. ప్రధానంగా అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీ కార్మికులు పిఎఫ్, జీతాలు పెంపు, ఇతర సమస్యలపై 7 వేల మంది చేసిన పోరాటానికి సంపూర్ణ సహకారం అందించింది. గ్రామాల్లో పర్యటించి కార్మికులకు ధైర్యం చెప్పి పోరాటాన్ని ఉధృతం చేయడానికి దోహదపడింది. అలాగే నర్సీపట్నం ఏరియాలో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు సుదీర్ఘకాలం నడిపిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని వారిని నడిపించింది. నక్కపల్లి హెటిరో, అచ్యుతాపురం అభిజిత్‌తో పాటు సెజ్‌ల్లోని వివిధ కంపెనీల కార్మికుల పోరాటాలకు అండగా నిలబడింది. ఏజెన్సీలోని టూరిజం కార్మికులు, హాస్టల్ వర్కర్లకు వేతన ఒప్పందం, ఇతర సమస్యలపై పోరాటం నిర్వహించి హాస్టల్ వర్కర్లకు విజయం చేకూర్చింది. స్కీమ్ వర్కర్లకు ఏ సమస్య వచ్చినా సిపిఎం స్పందిస్తోంది.

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ..

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే సిపిఎం పోరును సాగించింది. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో సమయంలో జిల్లాలో జరిగిన ప్రధాన సమస్యలపై ఉద్యమాలు చేసే సందర్భాల్లో సిపిఎం నాయకులను గృహనిర్బంధం చేసి అర్ధరాత్రి అరెస్టులు చేసి స్టేషన్లో వుంచారు. మహిళలను కూడా ముందస్తు అరెస్టు చేసి స్టేషన్లో వుంచిన ఘటనలో అనేకం జరిగాయి. ఏజెన్సీలోనూ, గ్రామీణంలోనూ మూడేళ్ల కాలంలో 1,106 మంది సిపిఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

సామాజిక సేవలో..

సిపిఎం ప్రజా సంఘాల నేతృత్వంలో ఇటీవల కాలంలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల అభిమానాన్ని పొందింది. విశాఖ ఏజెన్సీలో ప్రతి ఏటా ఎపిడిమిక్ సీజన్‌లో గిరిజనులు వివిధ రోగాలకు గురై మృత్యువాత పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో సిపిఎం చొరవ, సహాయంతో గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక వంటి సంఘాల ఆధ్వర్యాన విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించి లక్షలాది రూపాయల విలువల చేసే ఖరీదైన మందులను పంపిణీ చేయడం జరిగింది. నడిచి వెళ్లడానికి వీల్లేని గ్రామాలకు గుర్రాలపై వైద్యులను, మందులు తీసుకెళ్లి గిరిజనులకు వైద్యాన్ని అందించిన ఘనత సిపిఎంకే దక్కుతుంది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో గజ్జితో బాధపడుతుంటే సిపిఎం సహాయంతో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ సంఘాల కార్యకర్తలు 30వేల మంది విద్యార్థులకు గజ్జి మందును పూసి సేవలందించారు. ఏజెన్సీలోని సుదూర ప్రాంతాల నుంచి పిహెచ్‌సిలకు వచ్చే రోగులు, వారి బంధువులకు భోజనాలు లేక ఇబ్బంది పడుతుంటే సిపిఎం సహకారంతోనే గిరిజన సంఘం ఏజెన్సీలోని పిహెచ్‌సిల వల్ల ఉచిత భోజన కేంద్రాలు నడిపి భోజనాలు అందించింది. పలు మండలాల్లో గిరిజనులు ఆంత్రాక్స్ బారినపడితే వారికి మెరుగైన వైద్య సేవాల కోసం కృషి చేయడంతో పాటు, వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. చలితో బాధపడుతూ, చదువులు కొనసాగించలేకపోతున్న విద్యార్థులకు రగ్గులు ఉచితంగా పంపిణీ చేసింది. తోగు మంచినీటి సౌకర్యం కోసం గ్రావిటీ వాటర్ పథకాన్ని కొనసాగిస్తోంది. వ్యాధులు తీవ్రంగా ప్రబలే గ్రామాల్లో సిపిఎం కార్యకర్తలు శ్రమదానం విస్తృతంగా నిర్వహించారు. చదువుకున్న గిరిజన నిరుద్యోగులకు పాడేరు, అరకు, స్టీల్‌ప్లాంట్, యూనివర్శిటీల్లో నైపుణ్యం కల్గిన వారితో ఉచిత శిక్షణ ఇప్పించింది. దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకున్నా అక్కడి బాధితుల సహాయార్థం విరాళాలు వసూలు చేసి వారికి పంపించడం జరిగింది.


రోగులకు భోజనాలు వడ్డిస్తున్న సిపిఎం, ఎపిజిఎస్ నాయకులు (ఫైల్)

'జన్మభూమి'లో నిలదీతల పర్వం

భూ పరిహారం చెల్లించాలని కొండెంపూడి గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

మండలంలోని కొండెంపూడి గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం భూ నిర్వాసితులు అధికారులను నిలదీశారు. సమావేశాన్ని సర్పంచ్ అదర్రావు సత్యనారాయణ అధ్యక్షతన ఎంపీడీవో కొండలరావు నిర్వహిస్తుండగా సభ మధ్యలోకి ప్రవేశించిన నిర్వాసితులు అధికారులను ప్రశ్నించారు. తమ వద్ద నుండి ప్రభుత్వం రెండేళ్ల క్రితం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాల సాగు భూములు తీసుకుని ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. భూమి వద్దకు కూడా తమను వెళ్ల నివ్వలేదని, తామెలా బతకాలని ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చాకనే సభను నిర్వహించాలని అడ్డుకున్నారు. సభను అడ్డుకోవడం భావ్యం కాదని, ఏమైనా సమస్యలు ఉంటే తమకు రాతపూర్వకంగా ఇవ్వాలని ఎంపీడీవో సర్ది చెప్పినా వారు వినలేదు. చాలా సేపు సభ మధ్యలోనే ఆందోళనతో నినాదాలు చేశారు. దీంతో, కొద్ది సేపు గందరగోళం ఏర్పడింది. అధికారులంతా సర్ది చెప్పడంతో ఆందోళనను విరమించారు. అనంతరం మొక్కుబడిగా గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేటలో అధికారులను నిలదీస్తున్న నిర్వాసితులు



నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

మండలంలోని కోమాళ్లపూడి, చిన అప్పన్నపాలెం, పి.భీమవరం గ్రామాలో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి శి, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పలరాజుపురంలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి చీడికాడ

మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఖండివరం పశు వైద్యాధికారి ప్రసన్న ఆధ్వర్యంలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 114 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సమీప పశువైద్య కేంద్రాలను సంప్రదించాలని ఆయన సూచించారు.



పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారి

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట

రావికమతం మండలం జడ్.కొత్తపట్నం గ్రామంలో గురువారం విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు సంక్రాతి పండగ బోనస్ అందజేశారు. గ్రామానికి చెందిన 53 మంది సభ్య రైతులకు లక్షా 43 వేల 800 నగదును అందజేసామని విశాఖ డెయిరీ కొత్తకోట ఏరియా సూపర్‌వైజర్ సత్యనారాయణ చెప్పారు. బోనస్‌తో పాటు ఉచితంగా మూడు వందల విలువైన దాణా గిన్నె అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం వేతన కార్యదర్శి గాలి తాతాజీ, గ్రామ నాయకులు గాలి రమణబాబు పాల్గొన్నారు.

ఘనంగా కొణతాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చీడికాడ

మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను జెడ్‌పిటిసి సభ్యురాలు పోలపర్తి సత్యవతి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వృద్ధాశ్రమానికి జెడ్‌పిటిసి రూ.2 వేల ఆర్థిక సాయం అందించి, వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొణతాల మంత్రిగా ఉన్నపుడు ప్రజలకు అనేక సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పివిజి కుమార్, ఎంపిటిసి సభ్యులు కురచా కుమారి, గుమ్మాళ్ల కుమారి, మాజీ జెడ్‌పిటిసి సత్యనారాయణరాజు, అప్పలనాయుడు, పరవాడ రామారావు, కురచా సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల :

మాడుగులలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను చీడికాడ జడ్‌పిటిసి పొలుపర్తి సత్యవతి, పివిజి కుమార్ ఆధ్వర్యంలో అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండు వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంగేటి సూర్యారావు, కోట్ని వరహాలురాజు, భూపతిరాజు సత్యనారాయణరాజు, యల్లపు రాము, భీమరశెట్టి పైడినాయుడు, కనిశెట్టి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

పాత దరఖాస్తుల సంగతేంటీ?

ప్రజాశక్తి - చీడికాడ

గత జన్మభూమిలో ఇచ్చిన దరఖాస్తులను నేటికీ పరిష్కరించ లేదని సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు అధికారులను నిలదీశారు. మండలంలోని అప్పలరాజుపురం, తురువోలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నదీ తెలుసుకొనేందుకు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుచ్చు కళావతి, జెడ్‌పిటిసి పోలపర్తి సత్యవతి, ఎంపిడిఒ గ్లాడ్స్, తహశీల్దార్ పి.భాగ్యవతి, ఇఒపిఆర్‌డి బి.చైతన్య, ఎఒ శ్యామ్‌ప్రసాద్, రెడ్డి సన్యాసినాయుడు, లాలం శివకుమార్, షేక్ చిన్నాసాహెబ్, గవిరెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.



చీడికాడలో మాట్లాడుతన్న అధికారి

కాంగ్రెస్, టిడిపిల వాగ్వివాదం

ప్రజాశక్తి - దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి గ్రామంలో గ్రామ సభలో కాంగ్రెస్, టిడిపి నాయకుల మధ్య వాగ్వివాదం చెలరేగింది. సభ ప్రారంభమైన వెంటనే జెడ్‌పిటిసి గాలి వరలక్ష్మి ప్రసంగించి వేరే కార్యక్రమానికి వెళ్లి పోతున్నానని చెప్పడంతో సర్పంచ్ అవుగడ్డ కోటిపల్లి నాయుడు మైక్ తీసుకొని పార్టీలతో ప్రమేయం లేకుండా అందరికీ పింఛన్లు ఇస్తున్నామని చెప్పడం బాగానే ఉందని, ప్రస్తుతం వీటి మంజూరులో జాప్యం చేస్తూ పార్టీ పరంగా చేస్తున్నారని పేర్కొన్నారు. జన్మభూమి కమిటీ సభ్యుడు కిల్లి గోవింద కలుగజేసుకొని గత ప్రభుత్వంలో 28 మంది పింఛనుకు దరఖాస్తులు చేసుకుంటే అప్పుడు పార్టీ పరంగా నిలుపుదల చేయడంతో వాటిని ఇప్పటి వరకు మంజూరు కాకుండా అలాగే ఉన్నాయనడంతో మాజీ సర్పంచ్ అవుగడ్డ రామ్మూర్తినాయుడు కలుగజేసుకోవడంతో జన్మభూమి సభలో దుమారం రేగింది. ఇరువర్గాల వారు తోపులాటకు దిగారు. ఎస్ఐ పి.నర్సింహమూర్తి రెండు వర్గాలను చెదరగొట్టడంతో సర్దుమణిగింది.



మారేపల్లిలోకాంగ్రెస్, టిడిపి నాయకుల మధ్య వాగ్వివాదం

గ్రామ సమస్యలపై ఏకరవు

ప్రజాశక్తి-కొత్తకోట

రావికమతం మండలం టి.అర్జాపురంలో జరిగిన సభలో జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.జయప్రకాష్‌నారాయణకు గ్రామ సమస్యలపై సర్పంచ్ ఇల్లపు సన్యాసినాయుడు ఏకరువు పెట్టారు. రక్షిత పథకాల నిర్మాణంలో అధికారులు అలసత్వం చేస్తున్నారని ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేయాలంటే నీటి సౌకర్యం కల్పించాలన్నారు. టి.అర్జాపురంతో పాటు చిలక వవానిపాలెం, రామన్న దొరపాలెంలో రక్షిత పథకాలు నిర్మించాలని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వితంతులకు పింఛన్లు ఇవ్వాలని తెలిపారు.



సమస్యలను తెలియజేస్తున్న గ్రామస్తుడు

ఎంపిటిసి మడగల అర్జున, గ్రామస్తుడు అద్దిపల్లి రమేష్‌నాయుడు అధికారుల తీరుపై దుయ్యబట్టారు. అధికార పార్టీ అండతో పాత మరుగుదొడ్లకు బిల్లులు మంజూరు చేసి అవకతవకలకు పాల్పడ్డారని, మూడవ విడత రైతు రుణ మాఫీపై నీలదీసారు. పంచాయతీలో ఆరోగ్య సబ్ సెంటర్ ఏర్పాటు, పశువైద్యశాల, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో సిసి రోడ్లు, మురుగు నీటి కాలవులు నిర్మాణం చేపట్టాలని జడ్పీటీసీ భర్త, టిడిపి మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు సిఇఒకు వినతిపత్రం అందించారు.

స్పందించిన సిఇఒ జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ దృషికి సమస్యలను తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభలో తహశీల్దార్ ఎస్.సి ద్దయ్య, ఇఒపిఆర్‌డి మహేష్, ఎఇ పాత్రుడు, జెఇ సుమతి పాల్గొన్నారు. మండలంలో జడ్.బెన్నవరం, పి.పొన్నవోలు, మేడివాడ గ్రామాల్లో జన్మభూమి గ్రామ సభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.జయప్రకాష్‌రావు, ఎంపిపి డి. రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలేవీ?

ప్రజాశక్తి - కె.కోటపాడు

అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి జన్మభూమి కార్యక్రమానికి అర్థం లేకుండా చేస్తున్నారని మాజీ ఎంఎల్ఎ పూడి మంగపతిరావు ఆరోపించారు. మండలంలోని మేడిచర్ల, ఎ.భీమవరం, ఎ.కోడూరు, సూరెడ్డిపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మేడిచర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మాజీ ఎంఎల్ఎ పూడి పాల్గొని మాట్లాడుతూ, అనర్హులకు పింఛన్లతో పాటు ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను ఇచ్చి ఈ కార్యక్రమాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైవాడ సాగునీటి సంఘం చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు మాట్లాడుతూ, మేడిచర్ల గ్రామంలో 12 మందికి పింఛన్లు మంజూరు చేశారని, వీరిలో ఏ ఒక్కరు అనర్హులు ఉన్నా సభాముఖంగా తెలియజేయాలని ఆయన మాజీ ఎంఎల్ఎపై ఎదురుదాడికి దిగారు. మీరు ఎంఎల్ఎగా ఉన్న సమయంలో ఎంతమంది అనర్హులకు సంక్షేమ పథకాలు అందించారో మీకు తెలియదాని ఆయన ప్రశ్నించారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎ.కోడూరు సభలో టిడిపి నాయకులు బొడ్డు అక్కునాయుడు మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 20 మంది గతంలో ఇళ్లు పొందారని, నిజమైన లబ్ధిదారులకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు.

ఎంపిపి సబ్బవరపు పుష్పవతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సుబ్బలక్ష్మి, తహశీల్దార్ బివి రాణి, సర్పంచులు పూడి కృష్ణమ్మ, లెక్కల అక్కమ్మ, సూరెడ్డి కన్నంనాయుడు, తర్రా నారాయణరావు, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, ఎన్. రామునాయుడు, ఇఒపిఆర్‌డి ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొణతాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్ క్యాంపు కార్యాలయం వద్ద పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కొణతాల లక్ష్మీనారాయణ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలసాల కిషోర్, ఉత్తరాంధ్ర సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు కాండ్రేగుల చందు, మాజీ కౌన్సిలర్లు, పీలా నాగశ్రీను (గొల్లబాబు), పెతకంశెట్టి జగన్మోహన్‌రావు, మడగల శ్రీనివాసరావు, కటకం లక్ష్మణరావు, సకల గోవిందరావు, పొలమరశెట్టి గిరినాయుడు, చదరం నాగేశ్వరరావు, బుద్ద శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రింగురోడ్డు వద్ద ఉన్న కొణతాల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కొణతాల లక్ష్మీనారాయణ(పెదబాబు) కేక్ కట్ చేశారు. పేదలకు బియ్యం, బట్టలు పంపిణీ చేశారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజీ సర్పంచ్‌లు, ఎంపిటిలు పీలా నాగశ్రీను, చదరం నాగేశ్వరరావు, మలసాల కిషోర్, శ్రీనువాసరావు, చిన్నివల్లభ నారాయణరావు, పీలా రాముడు, పెతకంశెట్టి రామ్మోహన్‌రావు, శకల గోవిందు, చదరం నాగేశ్వరరావు, కొండయ్యనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను గురువారం స్థానిక ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు కాండ్రేగుల చందు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నా, అవినాష్, యశ్వంత్, భాను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



అనకాపల్లిలో కేక్‌ను కట్ చేస్తున్న లక్ష్మీనారాయణ

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో కొణతాల అభిమాని దాడి చిన్నారావు ఆధ్వర్యంలో జరిగాయి. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ 70 మంది వృద్దులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మునగపాక పిహెచ్‌సిలోని రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల అభిమానులు మలసాల కిశోర్, పెంటకోట రమణబాబు, కాండ్రేగుల చందు తదితరులు పాల్గొన్నారు.

సెక్షన్ 498 ఎ చట్టంలో సవరణలు చేయరాదు

ప్రజాశక్తి - పరవాడ

మహిళల జీవితాలకు రక్షణ కల్పిస్తున్న 498 ఎ చట్టంలో ఎటువంటి సవరణలు చేయకుండా యథాతథంగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నం, పి.మాణిక్యంలు డిమాండ్ చేశారు. పరవాడ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడుతూ భారత శిక్షా స్మృతి (ఐపిసి) 498 ఎ చట్టం వరకట్న వేధింపుల బారిన పడుతున్న మహిళలకు రక్షణగా ఉందని, ఈ చట్టం మహిళా లోకం ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా వచ్చిందన్నారు. వరకట్న వేధింపులకు గురైన మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దీని ఆధారంగా భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. భర్త, అతని బంధువులపై అన్యాయంగా కేసులు పెడుతున్నారనే ప్రచారం సాగుతుందని, ఇది వాస్తవం కాదని వారు తెలిపారు. ఈ సమస్యపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తుందని తెలిపార. సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శోభ, ప్రమీలా దేవి, బి.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఐద్వా నాయకులు

పెందుర్తి క్రికెట్ జట్టు విజయం

ప్రజాశక్తి - అనకాపల్లి

పట్టణంలో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న కొణతాల కప్ క్రికెట్ పోటీల్లో పెందుర్తికి చెందిన జట్టు విజయం సాధించింది. కొణతాల రామకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా 25వ తేదీ నుండి క్రికెట్ పోటీలు నిర్వహించారు. సుమారు 56 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్స్‌లో పెందుర్తి విజయం సాధించింది. కొణతాల రఘునాథ్ రూ.30 వేల నగదును విజేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో మలసాల కిషోర్, సకల గోవింద్, బొడ్డేడ శేషు, డి.వి. కృష్ణారావు, గౌరీ సేవా సంఘ అధ్యక్షులు కర్రి సన్యాశినాయుడు, యల్లపు చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



విజయం సాధించిన జట్టు క్రీడాకారులు

పింఛన్ల మంజూరుపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - అనకాపల్లి టౌన్

ఇటీవల కాలంలో కొత్తగా మంజూరైన పింఛన్లపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోన లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ, అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లతో మీసేవా కేంద్రాలతో ఒప్పందం కుదుర్చుకొని ఆధార్ కార్డులలో వయస్సులు మార్పులు చేసి అనర్హులకు పింఛన్లు మంజూరు చేసి భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందుకోసం లబ్దిదారుని నుంచి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. మీసేవా కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీస్ వలయంలో జన్మభూమి సభలు

పోలీస్ బందోబస్తు మధ్య జన్మభూమి సభలు నిర్వహించడం అమానుషమని సిపిఐ గ్రేటర్ విశాఖ కార్యవర్గ సభ్యులు వైఎన్ భద్రం విమర్శించారు. గోవిందరావు భవన్‌లో గురువారం నిర్వహించిన సిపిఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న జన్మభూమి సభల్లో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పోలీసులతో బలవంతంగా కూర్చోబెట్టడం, లేకుంటే బయటకు గెంటివేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కోన లక్ష్మణ్, కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిపై ర్యాలీ

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెం, బంగారయ్యపేట గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల ప్రయోజనాలను తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాణిక్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుల్తానా, ఉపాధ్యాయులు వరలక్ష్మి, భవాని, కుమారి, శ్రీకన్య, కుమారి జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

7న విద్యార్థులకు లేఖ రచన పోటీ

ప్రజాశక్తి- అనకాపల్లి

విద్యార్థులకు లేఖా రచన పోటీలు ఈ నెల 7న నిర్వహిస్తామని అనకాపల్లి పోస్టల్ కార్యాలయ సూపరింటెండెంట్ కెవిఎల్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన తపాలా కార్యాలయంలో జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే వారు 5వ తేదీ లోపు దరఖాస్తుతో పాటు రెండు పాస్ పోర్టు ఫోటోలు జత పరచి వయస్సు ధృవీకరణపత్రంతో పాటు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, అనకాపల్లికి అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్: 08924232318, 9440372307 నెంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి డైట్‌లో వసంతోత్సవాలు

ప్రజాశక్తి - అనకాపల్లి టౌన్

స్థానిక డైట్ కళాశాలలో శుక్రవారం నుంచి 11వ వసంతోత్సవాలను నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ గురువారం తెలిపారు. ఈ ఉత్సవాలకు దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.కేశవరావు, ఏపి రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.కుమారిలు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. ముగింపు వేడుకలకు మంత్రి అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా, ఎంఎల్ఎ పీలా గోవింద సత్యనారాయణ విశిష్ట అతిథిగా విచ్చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పశు పోషణపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని పరవాడపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనంలో విశాఖ డెయిరీ ఆధ్వర్యాన పాడి రైతులకు పశు పోషణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో డెయిరీ ప్రాంతీయ అధికారి ఎస్.నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఎస్.రాంబాబు, నాగేశ్వరరావు, పాల సంఘం అధ్యక్షులు గుర్రాల సత్యారావు, పరవాడ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని ఎంపిపి పాఠశాల 2, ఎన్ఆర్‌సిటిసిలో లూయీస్ బ్రెయిలీ జయంతి వేడుకలను వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకప్పారావు, మండల వికలాంగుల సంఘం అధ్యక్షులు జాగారపు సత్యం, ఉపాధ్యాయులు బివి రమణమ్మ, వరలక్ష్మి తదితరులు లూయీస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇంటింటికి తాగునీటి సౌకర్యం

జన్మభూమిలో ఎంఎల్ఎ గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి - అనకాపల్లి టౌన్

రూ.25 కోట్ల నిధులతో ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యాన్ని అందిస్తామని ఎంఎల్ఎ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక భీమునిగుమ్మలో గురువారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు రూ.8 కోట్ల సిఎం సహాయ నిధి ప్రజలకు అందించామన్నారు. 26 మంది మూగ, చెవుడు ఉన్న వారికి ఆపరేషన్ల నిమిత్తం రూ.4 లక్షలు అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ షేక్ సుభాని, ఇఇ ఉదయ్‌కుమార్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, కొణతాల వెంకట్రావు, బిఎస్ఎంకె జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.290 కోట్లతో నూతన టెండర్లు

కశింకోట : పోలవరం ప్రాజెక్టుకు రూ.290కోట్లతో నూతనంగా టెండర్లు పిలిచామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. జన్మభూమి మావూరును సుందరయ్యపేటలో నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు రూ.49 కోట్లను కేటాయించి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామంలో 53 పింఛన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి టి.ధనమ్మ, ఎంపిపి లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణ, ఎఎంసి చైర్మన్ వేణిగోపీకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ సిద్దిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. సర్పంచ్‌కు ఎంఎల్ఎ గ్రాంటు కింద రూ.2.50 లక్షలు రిగ్గు బోర్లకు మంజూరు చేయగా తన సొంత స్థలంలో కోళ్ల ఫారంకు వాటర్ ప్లాంటుకు ఉపయోగించు కున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంటింటా కుళాయిల పేరుతో సుమారు 50 మంది నుంచి రూ.3,800 చొప్పున వసూలు చేసి ఆరు నెలలు గడిచినప్పటికీ నేటికీ కనెక్షన్లు వేయలేదని లక్ష్మి, సత్యనారాయణ, పైడికొండ అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంఆర్‌ఒ రాంబాబు, ఎంపిడిఒ శాంతిలక్ష్మి, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : పార్టీలతో ప్రమేయం లేకుండా పథకాలు అందిస్తున్నామని ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అన్నారు. మండలంలోని వాకపల్లి, వెంకట రాజపురం, మారేపల్లి గ్రామాల్లో గురువారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంజూరైన రేషన్‌కార్డులు, రైతు, డ్వాక్రా రుణమాఫీ పత్రాలను లబ్దిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేపడుతున్నామన్నారు. జెడ్‌పిటిసి గాలి వరలక్ష్మి మాట్లాడుతూ, రోజుకు 18 గంటలు శ్రమపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజల మన్ననలు అవసరం అని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారి జి.మహాలక్ష్మి, తహశీల్దార్ వైఎస్ నాగరాజు, ఎంపిడిఒ డి.చంద్రశేఖర్, సర్పంచులు లెక్కల దాలిబాబు, అవుగడ్డ కోటిపల్లి నాయుడు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని దామునాపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం, ఖండేపల్లి గ్రామాల్లో గురువారం జన్మభూమి మావూరు గ్రామసభలు సాదాసీదాగా నిర్వహించారు. ఆద్యంతం అధికారులు ప్రసంగాలకే పరిమితం కావడంతో సభలకు వచ్చిన వారు పూర్తయ్యేంత వరకు ఉండకుండా వెనుదిరిగారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కెవిఎస్ రవి, ఎంపిడిఒ జివి చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : మండలంలోని పొంగలిపాక, ఒమ్మలి గ్రామాలలో జన్మభూమి నిర్వహించారు. పొంగలిపాకలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సత్యప్రకాష్ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శైలజ, తహశీల్దార్ రామారావు, ఎస్ఐ ధనంజయ్, స్థానిక నేతల ఉండూరు దేముడు, నాయిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : ప్రజా సంక్షేమమే జన్మభూమి లక్ష్యమని వైస్ ఎంపిపి దాడి సూరినాగేశ్వరరావు అన్నారు. బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ముందు స్వచ్ఛభారత్‌పై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తహశీల్దార్ కెవివి శివ, నోడల్ అధికారులు కేశవ్‌పాండే, అప్పలస్వామి, మాజీ జెడ్‌పిటిసి వియ్యపు అప్పారావు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని మేడివాడ గ్రామంలో చెక్‌డ్యామ్‌లు, పంట కాలువలను ఏర్పాటు చేయాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. టి.అర్జాపురం, మేడివాడలో జన్మభూమిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మహేష్, హౌసింగ్ ఎఇ పాత్రుడు, ఎంఇఒ కె.అప్పారావు, సర్పంచ్ అరిశంకల రామారావు, ఎంపిటిసి విజయకుమార్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

అచ్యుతాపురం : రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తామని యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. గురువారం ఆవసోమవరం, చీమలపల్లి గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంజూరైన పింఛను పత్రాలు, రేషన్ కార్డులు అందించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చేకూరి శ్రీనివాసరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజాన రమేష్ కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ మామిడి శివ అప్పారావు, ఎంపిటిసి సభ్యులు ఎం.సంజీవు, ఎస్.రమణ, ఎస్.జువ్వాలనాయుడు, బలిరెడ్డి శ్రీనివాసరావు, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ పి.బలరాముడు, హౌసింగ్ ఎఇ ప్రసాద్, ఇంజినీరు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కాగిత'లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుని పర్యటన

నక్కపల్లి : మండలంలోని కాగిత గ్రామంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు యల్‌బి వెంకట్రావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న చంద్రన్న సంక్రాంతి సరుకుల పంపిణీలపై ప్రజలు అభిప్రాయాలను తెలుసుకొనేందుకు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో యలమంచిలి, చోడవరం, నక్కపల్లి ప్రాంతాల్లో సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి పలు డిపోలను తనిఖీ చేశారు. అనంతరం చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు, సియస్‌డిటిలు శ్రీనివాసరావు, మరళీ, ఆహార సంఘం సభ్యులు కొరాడ చంద్రరావు పాల్గొన్నారు.

సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

అచ్యుతాపురం : మండలంలో ఈనెల 6న జరిగే బహిరంగ సభను, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సిపిఎం కార్మిక కర్షక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. ఈ సభలకు పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కె.హేమంత్, మాజీ ఎంపి మిడియం బాబురావు, రాష్ట్ర నాయకులు సిహెచ్ నర్సింగరావు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాము, అప్పారావు, సత్తిబాబు, కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలు వాయిదా

నర్సీపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నర్సీపట్నం మండలం ధర్మసాగరం పర్యటన సందర్భంగా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 5న జరిగే 13, 14, 15, 16 వార్డుల్లో జన్మభూమి గ్రామ సభలు వాయిదా వేసినట్లు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామ సభలు ఈ నెల 9న నిర్వహిస్తామని చెప్పారు.

సదరం శిబిరాలు వికలాంగులకు వరం

అచ్యుతాపురం : సదరం శిబిరాలు వికలాంగులకు వరం లాంటివని యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. గురువారం అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సదరం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వికలాంగ ధ్రువపత్రాలకు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఈ శిబిరాలకు సంబంధిత వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహించి, ధ్రువపత్రాలు ఇస్తారని చెప్పారు. ఈ శిబిరానికి 324 మంది వికలాంగులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి సభ్యులు జె.శ్రీనివసారావు, సర్పంచ్ లాలం నాగేశ్వరరావు, కూండ్రపు వెంకటరావు, కళాశాల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముమ్మారెడ్డి పుట్టినరోజు

నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం టిడిపి సోషల్ మీడియా ఇన్‌చార్జి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు(బుజ్జి) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద చేతుల మీదుగా పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా బుజ్జికి రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్,చందు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - నక్కపల్లి

5వ విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మా కాలనీ అభివృద్ధి చేయండని కాగిత గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కాగిత, గొడిచెర్ల, డిఎల్‌పురం, అమలాపురం, జి.జె.పురం, గుల్లిపాడు గ్రామాల్లో సర్పంచ్ దేవవరపు దివాణం అధ్యక్షతన ఎండిఒ పిడుగు ఉమామహేశ్వరరావు జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన వినతుల ఏ మేరకు పరిష్కారమైయని అనే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా డిహెచ్‌పియస్ మండల అధ్యక్షులు పాండు, సర్పయ్య, పలువురు మహిళలు ఎన్నో రోజులుగా మంచినీటి బోరును నిర్మించమని కోరుతున్నామని ఆయనప్పటికి ఏ ఒక్కరూ మంచినీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళితులకు సమస్యలను పరిష్కారించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎంపిడిఒ పిడుగు ఉమా మహేశ్వరరావు, జిల్లా



అధికారులు సమస్యలను తెలుపుతున్న దళితులు

కోఆప్షన్ మెంబర్ కొప్పిశెట్టి కొండబాబులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరుగుదొడ్లు బిల్లులు అవ్వడం లేదని సర్పంచ్ దివాణం, గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గొడిచెర్ల గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో 24 గంటలు అందుబాటులో ఆసుపత్రి పని చేస్తుందని, చెప్పడమే తప్ప పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియమించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు యన్‌యస్‌వి సత్యనారాయణ, గ్రామస్తులు తహశీల్దార్ రాణి అమ్మాజీ దృష్టికి తీసుకొచ్చి తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఎంపిపి రమణ మాట్లాడుతూ సమస్యలులేని గ్రామాలుగా తీర్చిదిద్దమే ప్రభుత్వాల లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లల సూర్యకుమారి, మండలస్థాయి అధికారులు, నానిబాబు, శ్యామల, మహేష్, ఇరిగేషన్ జెఈ, ఆర్‌ఐలు బంగ్రారాజు, క్రాంతి, శారదాదేవి, శివప్రసాద్, ప్రత్యేకాధికారి కాశేశ్వరరావు, ఎంపిటిసి అడపా వరలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కొనతాల జన్మదినం

ప్రజాశక్తి-రోలుగుంట

మండలంలోని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్థానిక ఎంపిటిసి ఎర్రంశెట్టి కాంతమ్మ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రామకృష్ణ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జన్మభూమి

ప్రజాశక్తి-రోలుగుంట

మండలంలోని శరభవరం, కొంతలం గ్రామాల్లో నోడల్ అధికారి ఎపిడి ఆనందరావు అధ్యక్షతన, బుచ్చింపేటలో ఎంపిడిఒ శచీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకొని అభివృద్ధి సాధించాలన్నారు. శరభవరంలో యుపి స్కూల్ విద్యార్థులు గ్రామాన్ని అనుకొని ఉన్న చెరువులో కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే అనర్ధాలపై నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - అచ్యుతాపురం

ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని సంఘం గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం వలన సిపిఎస్ ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆశించిన ఆర్థిక సహాయం అందలేదని చెప్పారు. కావున ఈ జన్మభూమి ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శివానందం, ప్రధాన కార్యదర్శి నూకరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న ఉద్యోగులు

బహిరంగ మలవిసర్జన శిక్షార్హం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం

బహిరంగ మలవిసర్జన చేస్తే శిక్ష తప్పదని తిమ్మాపురం గ్రామ కార్యదర్శి కె.రామిరెడ్డి ప్రజలకు హెచ్చరించారు. గురువారం మేజర్ పంచాయతీ తిమ్మాపురం శివారు కోనవాని పాలెంలో బహిరంగ విసర్జనపై బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మలమూత్ర విసర్జన చేయడం వలన అనేక రోగాలకు గురి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. కనుక మరుగుదొడ్లు లేని వారు వెంటనే నిర్మించుకోవాలని, ఉన్న వారు ఉపయోగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోన అప్పలరాజు, పంచాయతీ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ దాసరి నానాజీ పాల్గొన్నారు.


బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మరుగుదొడ్లపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - నక్కపల్లి

మండలంలో జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా గురువారం ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎమ్.వేణుగోపాల్, పిడి కుందూరు రాజు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నినాదాలు చేస్తు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అన్నారు. ఈ మేరకు నక్కపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని జూనియర్ కళాశాల, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నట్టి అప్పారావు, ఆళ్ళ సుధాకర్, ఎన్.వి.ఎన్.ఆచార్యులు అరుణ సత్యవతి, లక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గొలుగొండ : బహిరంగ మలవిసర్జనా రహిత గ్రామంగా ఉండాలంటే ప్రతి ఇంటిలో తప్పనిసరిగా మరుగుదొడ్డిని నిర్మించి, వినియోగించాలని కేడీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దు శ్రీనివాస్ అన్నారు. గురువారం గ్రామంలో అన్ని వీధుల్లోను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులు మరుగుదొడ్లు నిర్మించాలంటూ ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన వద్దు, మరుగుదొడ్డ నిర్మాణాలతోనే మహిళలకు ఆత్మగౌరవం అంటూ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వం చేయూతతో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డను నిర్మించుకుని సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాసు, గోవిందు,శంకర్, పూర్ణేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : జన్మభూమి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని వాటిపై అవగాహన నర్సీపట్నంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు గురువారం నర్సీపట్నం, పెదబొడ్డేపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గురుకుల పాఠశాల నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలుగుంట : ప్రతి ఒక్కరు మరుగుదొడ్డు నిర్మించుకోవాలని మండలంలోని కొవ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఉప్పులూరి శ్రీవాణి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.ఈశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులంతా మరుగుదొడ్లు నిర్మించుకొని ప్రతి ఒక్కరు దాన్ని నిర్మించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. హైస్కూల్ నుండి ప్రారంభించి గ్రామ చుట్టూ ర్యాలీ నిర్వహించారు.

ఎస్.రాయవరం : దోమలను నివారించాలనే ఉద్దేశంతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రత - దోమలపై దండయాత్ర అంటూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కురందాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే దోమలు పెరిగి రోగాల బారిన పడతామని చెప్పారు. అలా కాకుండా పంచాయతీ వారు ఏర్పాటు చేసిన నిర్ణీత ప్రాంతాల్లో చెత్తను వేస్తే అక్కడ నుంచి తరలిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వెంటరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటరత్నం, హుస్సేన్ వై.కొండయ్య, పి.అనంతలక్ష్మి, ఎం.ఆర్.వి.ఎస్.నారాయణ, ఎస్.శంకర్, వి.ఆర్.ఎం.ఈశ్వరరావు, రామరాజు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకే బిజెపి సేవలు : ఎజె స్టాలిన్

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్

అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరచి కేవలం కార్పొరేట్ సంస్థలకు మాత్రమే సానుకూలంగా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎజె స్టాలిన్ అన్నారు. గురువారం నర్సీపట్నం మండలం గబ్బడా గ్రామంలో కామ్రేడ్ మాకి రెడ్డి రాజు బాబు అధ్యక్షతన రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఐక్యంగా ఉన్న మతాలను రెచ్చగొట్టి ముఖ్యంగా బహిరంగంగా చంపుతున్నారని చెప్పారు. ఒకే దేశంలో ఒకే మతం అనే నినాదంతో హిందూమతం మాత్రమే ఉండాలని మతాలను కులాలను రెచ్చగొట్టడం సరికాదని



మాట్లాడుతున్న ఎజె స్టాలిన్

చెప్పారు. రాష్ట్రంలోని అధికారంలో ఉన్న టిడిపి ముఖ్యమంత్రి చేయాల్సిన పనులు చేయకుండా కేంద్ర ప్రభుత్వానికి భజనలు చేస్తూన్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే ఉద్యమాల ద్వారా ఈ ప్రభుత్వం నిలదీయాలని పిలుపునిచ్చారు. అనంతరం 9 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శులుగా నల్లబెల్లి శ్రీరామమూర్తి, కామిరెడ్డి లక్ష్మి, ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాకి రెడ్డి రామునాయుడు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగా భవాని, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి శివలంక కొండలరావు , నర్సీపట్నం రూరల్ కార్యదర్శి జిగురు బాబు, నర్సీపట్నం టౌన్ కార్యదర్శి రూత్తల పెద్ద బుజ్జి , పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు - అయ్యన్న

ప్రజాశక్తి - గొలుగొండ

అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలు అందిస్తామని రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం మండలంలో కొత్తయల్లవరం, సాలికమల్లవరం, చోద్యం గ్రామాలో జన్మభూమి - మా ఊరు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్, మండలస్థాయి అధాకారులంతా ప్రజలకు సంక్షేమపథకాలను తెలియజేసేందుకే రాష్ట్రప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం చేపట్టిన్నారు. పించన్లు కోసం టిడిపికి చెందిన ప్రజాప్రతినిధులే తప్పుడు ధృవపత్రాలు సృష్టించడం తగదని హితువు పలికారు. ఓట్లు కోసం ఇటువంటి వాటిని సమర్ధించకూడదని, ఇటువంటి సంఘటనలవల్ల అర్హులకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.అనంతరం గ్రామంలో వున్న 35 డ్వాక్రా సంఘాలకు వచ్చిన వడ్డీ రాయితీ సొమ్ము రూ.6లక్షల 35వేలు అందజేశారు. సభలో అంగనవాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ స్టాలులను పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌష్టికాహారా స్టాలు వద్ద బాలునికి ఆయన అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజను ప్రత్యేకఅధికారి డిఎఫ్ఓ జి. శేఖరుబాబు, ఇరిగేషను డి.ఇ. చిన్నంనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డి.ఇ. రామస్వామి, పంచాయితీరాజ్ ఇ.ఇ. సంపత్‌కుమార్, నర్సీపట్నం మార్కెట్టుకమిటీ చైర్మెన్ అడిగర్ల అప్పలనాయుడు, ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకఅధికారి ఆర్. శ్రీనివాసు, ఎమ్డీఓ సువర్ణరాజు, సర్పంచ్ జల్లు కొండమ్మ, ఎంపిటిసి శెట్టి వరహాలమ్మ, టిడిపి మండల యూత్ అధ్యక్షులు బెల్లపు కొండలరావు, పార్టీ సీనియర్ నాయకులు కొల్లు రాంబాబు, మార్కెట్టు కమిటి డైరెక్టరు కొల్లు పత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రాసన చేస్తున్న మంత్రి అయ్యన్న

విద్యాకాలాన్ని వృథా చేయడం సరికాదు : సిపిఎం



జన్మభూమిలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-నర్సీపట్నం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జన్మభూమి కార్యక్రమాలకు ఎన్నడులేని విధంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, వార్డెలను భాగస్వామ్యం చేసి విద్యా కాలాన్ని వృథా చేయడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని సిపిఎం నర్సీపట్నం డివిజన్ నాయకులు డి.సత్తిబాబు, ఎ.రాజు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగ పడే కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడితే వీరందరినీ ఎందుకు తరలించారని ప్రశ్నించారు. నేటీ వరకు ప్రజలు కార్యాలయాల చుట్టూ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సంక్షేమ పథకాలు అనేక సమస్యల మీద తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. నేటికీ మున్సిపాలిటీలో లింక్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు అస్థవ్యస్తంగా ఉన్నాయని, రక్షిత మంచినీరు అందించడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవేవి పట్టించుకోకుండా ప్రభుత్వం రానున్న ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులను సైతం ఉపయోగించుకోవడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. కావున విద్యార్థులను ఇందులో నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు.

కోటవురట్లలో...

జన్మభూమి కార్యక్రమం వలన విద్యార్థుల సమయం వృధా అవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ జన్మభూమిలో భాగంగా రెండు నుంచి 11 తరగతి విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించి, బహుమతులు అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు పాఠశాలల్లో పోటీల అనంతరం విద్యార్థులు జన్మభూమికి హాజరు కావాల్సి వస్తుంది. దీంతో విద్యార్థులకు సరైన సమయానికి భోజనం అందక ఇబ్బందులు పడుతున్నారు. బోజన సమయం బహుమతులు ఇవ్వడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనపై అయ్యన్న సమీక్ష, ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్

నర్సీపట్నం మనండలం ధర్మసాగరంలో శు క్రవారం జరగబోయే జన్మభూమి - మన ఊరు కార్యక్రమంలో భాగంగా చేసే ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం పరిశీలించారు. ధర్మసాగరం గ్రామంలోని ఏర్పాటు చేసిన పలు సాంస్కతిక, విద్యా రంగానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. గ్రామంలో జరిగిన అభివద్ధిని వివరించాలని, లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, చంద్రన్న భీమా కార్డులు పద్ధతి ప్రకారం క్రమశిక్షణతో అందజేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సజన, జెసి - 2 సిరి, డిఆర్‌డిఒ పీడీ సత్య సాయి శ్రీనివాస్, డ్వామా పిడి కల్యాణ చక్రవర్తి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ పీడీ చిన్మయి దేవి, డిప్యూటీ డిఇఒ సునీత, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు, పర్యాటక సమాచార అధికారిని పూర్ణిమ, మండల ప్రత్యేక అధికారి సిహెచ్ మహాలక్ష్మి, ఎంపిపి సుకల రమణమ్మ, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తు్న మంత్రి అయ్యన్న

నర్సీపట్నంలో... : ధర్మసాగరంలో ఈ నెల 5న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ పాటిస్తూ ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ కలగకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధిని గురించి పూర్తి చేసిన పథకాలను గురించి వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి సత్యనాయి శ్రీనివాస్, ఆర్‌డిఒ కె.సూర్యారావు తదితర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం : విశాఖ జిల్లా నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో ఈనెల 5న ముఖ్యమంత్రి జన్మభూమి కార్యక్రమంలో వస్తున్న సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తత బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా అన్ని ప్రాంతాల్లో పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలను అప్రమత్తం చేశారు. సిఎం ధర్మసాగరం వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో అటువైపు వెళ్లే రూట్‌లను క్రమబద్ధీకరించారు. గ్రామానికి వెళ్లి హెలిపాడ్ స్థలం, బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా స్థానిక ఎఎస్‌పి చర్చించారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న విజయ్

భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుకు మంత్రి తనయుడు కృషి

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయడానికి ప్రపంచ బ్యాంకుకు వెళ్లి చర్చించినట్లు రాష్ట్ర మంత్రి అయ్యన్న తనయుడు, యువనేత చింతకాయల విజయ్ చెప్పారు. జార్జి వాషింగ్టన్ యూనివర్శిటీలోని పొలికలో ఉన్నత విద్యనభ్యసించడానికి వెళ్లిన ఆయన బుధవారం ప్రపంచ బ్యాంకుకు వెళ్లి అధికారులతో నర్సీపట్నం భూగర్భ డ్రైనేజీపై చర్చించినట్లు తెలిపారు. చుట్టు పక్కల మండలాల్లో ఏడాదికి 3,51,063 మంది ప్రజలు అనారోగ్యానానికి గురవుతున్నారని, ప్రపంచ బ్యాంకు అధికారులకు చెప్పారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి బ్యాంకు అధికారులకు ఆర్థిక సహాయాన్ని కోరగా, అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు.

జన్మభూమిలో పింఛన్లపై ఫిర్యాదులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధిలోని 11, 12 తదితర వార్డుల్లో గురువారం మున్సిపల్ కమీషనర్ జె.సురేంద్ర, డిఇఇ రంగ కామేశ్వరరావు రెండు టీమ్‌లుగా జన్మభూమి గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాంగా ప్రజలు పింఛను, రేషన్ కార్డులు మంజూరు చేయాలని అధికారులకు ఫిర్యాదులు చేశారు. అంతకు ముందు చెంబూ, శవయాత్రలను నిర్వహించారు. బహిరంగ మలసర్జన చేయదాని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చంద్రన్న క్రిస్టమస్ కానుకలు, చంద్రనన బీమా చెక్కులు మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, తమరాన నాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నాతవరం : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే జన్మభూమి ఉద్దేశమని ఎంపిపి సింగంపల్లి సన్యాసిదేముడు, జడ్‌పిటిసి కరక సత్యాన్నారాయణ అన్నారు. గురువారం మండలంలో ఎంబిపట్నం, వైబి అగ్రహరం, నాయుడుపాలెం, గన్నవరం పంచాయితీల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహంచారు. గన్నవరం మెట్టవద్ద ఆ గ్రామానికి వచ్చే మలుపులో డ్రైనెజ్ సమస్య ఎక్కువుగా ఉందని గ్రామస్తులు వారి దృష్టికి తిసుకురాగా.. సమస్యను పరిస్కారిస్తామన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ కనకరావు, ఎంపిడిఒ యాదగిరీశ్వరావు, ఆర్‌డబ్లుయస్ ఎఇ జయరామ్, ఎంఇఒటి అమృతకుమార్, హస్పటల్ అభివృద్ధి అధికారి కాశపు అప్పారావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు భాస్కరశర్మ, అధికార్లు, ఎంపిటిసిలు, సర్పంచులు,పాల్గున్నారు.

కెజిబివి పాఠశాల ఎస్ఒపై విచారణ

రోలుగుంట : స్థానిక కస్తూర్బా పాఠశాల ఎస్ఒ త్రివేణిపై తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రుత్తల తాతునాయుడు, పైడిఘంటం రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కెజిబిఎస్, ఎపిఎస్ఎస్‌సి స్టేట్ డిప్యూటీ సెక్రటరీ వి.పార్వతీదేవి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎస్ఒ త్రివేణి ఈ ఏడాది 6వ తరగతి పిల్లల ఎడ్మిషన్‌పై, అలాగే మెనూ సక్రమంగా నిర్వహించలేదని వారు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ విషయాలపై పిల్లలను, వారి తల్లిదండ్రుల ద్వారా వాస్తవాలను తెలుసుకొని ఆమెపై చర్య తీసుకుంటామన్నారు. ఈమె వెంట జిసిడిఒ స్వప్నప్రియరెడ్డి పాల్గొన్నారు.



విచారిస్తున్న అధికారులు

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

అత్యాచార బాధితురాలిని పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్
రూ.5 లక్షల ఆర్థిక సహాయం
ప్రభుత్వ ఉద్యోగానికి ప్రతిపాదిస్తామని హామీ
సర్కారు అండగా ఉందని జెర్రిపోతులపాలెం బాధితురాలికి భరోసా

ప్రజాశక్తి- విశాఖపట్నం

మూగ గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ తెలిపారు. కెజిహెచ్‌లో చికిత్సపొందుతున్న అత్యాచార బాధితురాలిని గురువారం ఆయన పరామర్శించారు. వైద్య సేవలు ఏమేరకు అందుతున్నాయో ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉందని, ఏ మాత్రం ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. తొలి విడతగా రూ.2.50 లక్షల చెక్కును బాధితురాలికి అందజేశారు. అంతకుముందు ప్రభుత్వ అతిథి గృహంలో షెడ్యూల్డు కులాలు, తెగలు, ఆయా కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు, విజ్ఞాపనలు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెర్రిపోతులపాలెం బాధితులతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అండగా ఉందని, ఏ మాత్రం భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని అన్నారు.

అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకు పోయిన కుల వివక్షత, అంటరానితనం, అస్పృశ్యతలను నివారించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాల్సినవసరం ఎంతో ఉందన్నారు. సమాజంలో అసమానతల నిర్మూలన ఒక్క ఎస్‌సి, ఎస్‌టి వర్గాల వారితోనే ఇది సాధ్యం కాదని, అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. జిల్లాలో సుమారు 261 ఫిర్యాదులు వలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కమిషన్ సభ్యులు సివేరి సోమ, ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమణమూర్తి తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివాజీ



శివాజీకి విన్నవిస్తున్న ఆదివాసీ నాయకులు

బోయలను ఎస్టీలో చేర్చొద్దు

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి

ప్రజాశక్తి-విశాఖపట్నం

బోయ వాల్మీలను ఎస్టీలో చేర్చొద్దని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారం శివాజీని సర్క్యూట్ హౌస్‌లో ఆదివాసీ విద్యార్థి సంఘం బుధవారం కలిసి విన్నవించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.మధుకుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల అసలైన ఆదివాసీ గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. రాష్ట్రంలో ఆదివాసీ గిరిజన తెగలు 35 ఉండగా, 2011 లెక్కల ప్రకారం 35 లక్షల జనాభా ఉన్నారని పేర్కొన్నారు. వీరికి 7.5 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సివున్నప్పటికీ 6శాతం మాత్రమే ఇస్తున్నారన్నారు. బోయలను ఎస్టీలో చేర్చడం వల్ల గిరిజన, ఆదివాసీ తెగలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఉద్యోగ పరంగా మరింత వెనుకబడి పోతున్నారని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆదివాసీలను బలిచేయడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. దీనికి కమిషన్ చైర్మన్ స్పందించి పునరాలోచన చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

గిరిజన మూగ బాలికకు న్యాయం జరిగే వరకూ పోరాటం

- హెచ్‌బిఎల్ కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి
- ప్రజా సంఘాల ధర్నాలో నాయకులు



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

అత్యాచారానికి గురైన గిరిజన మూగ బాలికకు న్యాయం జరగకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఘటనలో నిందితున్ని నిర్భయ చట్టం కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), గిరిజన సంఘం, ఐద్వా, జిల్లా బధిరుల సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట గురువారం ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో, ఇల్లు, భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్న హెచ్‌బిఎల్ కంపెనీ యాజమాన్యాన్ని, వారికి సహకరించిన ఇతర అధికారులనూ అరెస్టు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రోజురోజుకూ దాడులు, హింస, అత్యాచారాలు, వేధింపులు రాష్ట్రంలో పెరుగుతున్నా చంద్రబాబు ప్రభుత్వం వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, నగర అధ్యక్షులు పాల వెంకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, వేములవలస మాజీ సర్పంచి కోరాడ అప్పలస్వామి నాయుడు, ఐద్వా నగర, జిల్లా అధ్యక్షులు సూర్యమణి, ద్రాక్షాయణి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సుమిత్ర, గిరిజన సంఘం నాయకులు పృథ్వీరాజు, కోటిబాబు, వరలక్ష్మి, జిల్లా బధిరుల సంఘం నాయకులు చంద్రశేఖర్, బధిర భాష అనువర్తకులు లక్ష్మి, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అత్యాచార బాధితురాలిని ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహా'రణం'

ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి బిజెపి కుట్ర
డిసిఐ వేటుకు వ్యతిరేకంగా నేడు ప్రజాబ్యాలెట్
స్టీల్‌ప్లాంట్ రక్షణకూ తప్పని పోరాటం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

డిసిఐని అమ్మేయాలని కేంద్రంలోని బిజెపి క్యాబినెట్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓ వైపు పోరాటం తీవ్రమవుతున్న తరుణంలో సిగ్గూఎగ్గూ లేకుండా కేంద్రం మరో పిడుగును విశాఖ కార్మికవర్గంపై పడేసింది. డిసిఐ తర్వాత స్టీల్‌ప్లాంట్ లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రయాణిస్తోంది. దేశంలో సముద్ర తీరాన గల ఏకైక స్టీల్‌ప్లాంట్ ఆర్ఐఎన్ఎల్‌లో పెట్టుబడులను 10శాతం ఉపసంహరించాలని క్యాబినెట్ ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్‌లో లోపల మండే 'ఫర్నేస్‌'లు ఇక నుంచి ప్లాంట్ బయటే ఉద్యోగుల ఆందోళన రూపంలో మండేందుకు రంగం సిద్ధమవుతోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న ఆలోచన మోడీ ప్రభుత్వానికి ఉందన్న సంగతి తెలిసి, ఇప్పటికే ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయి. 10శాతం వాటాలను ఉపసంహరణకు తెగబడుతుందన్న విషయంపై నిత్యం ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున భయపడుతూనే ఉన్నారు. అయితే డిసిఐ ఆందోళన జరుగుతున్న సమయంలో స్టీల్‌ప్లాంట్‌పై ఇలాంటి తెగింపు నిర్ణయం చేస్తుందా? అన్న అనుమానాలు కొంతమందిలో ఉన్న మాట వాస్తవం. కానీ ఒకదాని తర్వాత ఒకటి అనే పద్ధతి గాకుండా దెబ్బమీద దెబ్బకొట్టే పద్ధతిని బిజెపి అనుసరిస్తుందన్న అంచనా వామపక్షాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. నేడు సరిగ్గా అదే జరిగింది. కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఎంత కుట్రపూరితంగా ఉందనడానికి పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయమే తార్కాణం. ప్రగతి సరిగ్గా లేదని పెట్టుబడులను ఉపసంహరిస్తున్నట్లు చెప్పే కేంద్రానికి డిసిఐలో ఏం తక్కువైందని (లాభాల్లో ఉన్నా) అమ్మేందుకు ఎందుకు తెగబడుతుందంటూ మేధావులు ప్రశ్నిస్తున్నారు. డిసిఐతో పాటు తాజాగా స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణపై 'రణం' మొదలుకానుంది. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి విష్ణుదేవసాయి బుధవారం రాజ్యసభలో వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి వేసిన ప్రశ్నకు సమాధానంగా విశాఖ ఉక్కు నష్టాలకు మార్కెట్ అననుకూల పరిస్థితులను వెల్లడించారు. నియంత్రణ ఎత్తివేసే రంగాల్లో ఉక్కు ఉత్పాదనా రంగం ఒకటని మంత్రి సెలవిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం, ఎన్ఎండిసికి బకాయి పడడం వంటివి ఈ కాలంలో స్టీల్‌ప్లాంట్‌పై మరింత భారాన్ని పెంచాయి. కానీ ప్రభుత్వ ఉద్దేశం చూస్తుంటే స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న వేల ఎకరాల భూమిని కార్పొరేట్లకు కట్టబెట్టాలనే దీర్ఘకాలిక వ్యూహం కూడా లేకపోలేదు.

హోరాహోరీగా సౌత్ జోన్ క్రికెట్ పోటీలు

224 భారీ స్కోర్ చేసిన ఎఎన్‌యు జట్టు

విశాఖ :సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. గురువారం విశాఖ, విజయనగరంలలోని పలు వేదికల్లో పోటీలు జరిగాయి. ఎనిమిది వేదికల్లో 16 మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరు ఎఎన్‌యు జట్టు భారీ స్కోర్ నమోదు చేసింది. విజయనగరం మహారాజా కళాశాల మైదానంలో ఎఎన్‌యు, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎఎన్‌యు జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 5 వికెట్ల నష్టానికి 224 భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన తమిళనాడు జట్టు పేలవమైన ఆటతీరుతో 57 పరుగులకే చేతులెత్తేసింది. ఫలితంగా 167 భారీ తేడాతో ఎఎన్‌యు జట్టు విజయం సాధించింది. జట్టులో సాయి వర్ధన్ 74 బంతులాడి సెంచరీ చేశాడు. విజయనగరం జెఎన్‌టియు మైదానంలో జరిగిన మ్యాచ్‌లో శాతవాహన, కారుణ్య యూనివర్సిటీలు తలపడ్డాయి. శాతవాహన ముందుగా బ్యాటింగ్ చేసి 25 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కారుణ్య యూనివర్సిటీ జట్టు 23.3 ఓవర్లలో 114 పరుగులకే ఆలవుట్టైంది. 52 పరుగుల తేడాతో శాతవాహన యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. విజయనగరం రైల్వే గ్రౌండ్స్‌లో అమృత విశ్వ విద్యాపీఠ్, గాంధీగ్రామ్ యూనివర్శిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన అమృత విశ్వ విద్యాపీఠ్ యూనివర్సిటీ ఏడు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. గాంధీగ్రామ్ జట్టు 25 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 119 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో అమృత యూనివర్సిటీ జట్టు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. విశాఖ పోర్టు స్టేడియంలో కేరళ ఎంజి, తమిళనాడు విట్ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. ఎంజి యూనివర్సిటీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 190 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన విట్ యూనివర్సిటీ జట్టు 17.5 ఓవర్లలో 74 పరుగులకే ఆలవుటైంది. ఎంజి యూనివర్సిటీ 116 ఆధిక్యంతో విజయం సాధించింది. స్టీల్ ప్లాంట్ త్రిష్టా గ్రౌండ్స్‌లో కొచ్చి యూనివర్సిటీ, శివమొగ్గ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కొచ్చి జట్టు 25 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన అగ్రికల్చర్ యూనివర్సిటీ మూడు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. విజయనగరం ఎంవిజిఆర్ కళాశాల మైదానంలో ఆదికవి నన్నయ్య, దావంగరే యూనివర్సిటీలు పోటీ పడ్డాయి. దావంగరే జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆదికవి నన్నయ్య జట్టు 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టపోయి 184 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన దావంగరే జట్టు 25 ఓవర్లు ఆడి 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి ఓటమి చవి చూసింది. వైజాగ్ విజ్జీ స్టేడియంలో మంగుళూర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం అంబేద్కర్ యూనివర్సిటీలు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన మంగుళూర్ యూనివర్సిటీ జట్టు 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో అంబేద్కర్ జట్టు కేవలం రెండు పరుగులు వెనుక బడి వెనుదిరిగింది. గీతం మెడికల్ గ్రౌండ్స్‌లో విక్రమ్ సింహపురి, ధార్వాడ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్‌లు తలపడ్డాయి. ఇందులో 20 ఓవర్లలో విక్రమసింహపురి యూనివర్సిటీ జట్టు 6 వికెట్లు నష్టానికి 168 పరుగులు సాధించింది. ధార్వాడ్ యూనివర్సిటీ జట్టు 20 ఓవర్లలో 7 నష్టానికి 115 పరుగులతో వెనుదిరిగింది.